# ప్రజా తపన

prajathapana.com

News that matters




సుఖమయం, శుభదాయకం, అయిన లోకం సామాజిక ప్రగతి, వేడి మంచు, నల్లని వెలుగుల్లా అసంబద్ధమైనవే. అనర్థాలను సృష్టించని భౌతిక అభివృద్ధి ఉండదు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 30 శనివారం 11 మార్చి 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-



# భారతీయుల భద్రతకు భరోసా

**ప్రజాతపన, న్యూఢిల్లీ:**



ప్రధాని నరేంద్ర మోదీ ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్నారు. ఆ దేశ ప్రధాని ఆంథోని ఆల్బనీస్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియాలోని భారతీయుల భద్రతకు భరోసా ఇవ్వాలని ప్రధాని మోదీ అడిగారు. ఇందుకు ఆ దేశ ప్రధాని హామీ ఇచ్చారు. కొద్ది నెలలుగా ఆస్ట్రేలియాలోని పలు హిందూ ఆలయాలపై దాడులు జరుగుతున్నాయి. గోడలపై అసభ్యకరమైన రాతలు రాస్తున్నారు. దీనిపై చాలా రోజులుగా భారతీయులు రోడ్లపైకి వచ్చి నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రధాని మోదీ ఈ అంశాన్ని ప్రస్తావించారు. "ఆస్ట్రేలియాలో కొన్ని ఆలయాలపై దాడులు జరిగిన ఘటనలు నా దృష్టికి వచ్చాయి. ఇదే విషయాన్ని ప్రధాని ఆంథోని అల్బనీస్‌తో చర్చించాను. భారతీయుల భద్రతకు భరోసా ఇస్తామని నాకు హామీ ఇచ్చారు. ఇదే మా ప్రాధాన్యత అని కూడా చెప్పారు"- ప్రధాని నరేంద్ర మోదీ ఇదే సమావేశంలో ద్వైపాక్షిక బంధంపై చర్చలు జరిపారు ఇద్దరు ప్రధానులు. రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ రంగాల్లో పరస్పర సహకారంపై చర్చించారు. ఇండో పసిఫిక్ ప్రాంతంలో మెరిటైమ్ సెక్యూరిటీ విషయంలోనూ

(మిగతా 2లో)



# హైదరాబాద్ కు అమిత్ షా

**ప్రజాతపన , హైదరాబాద్ :**

కేంద్రమంత్రి అమిత్ షా మరోసారి తెలంగాణకు రానున్నారు. అయితే అమిత్ షా టూర్ లో స్వల్ప మార్పు జరిగింది. అమిత్ షా సంగారెడ్డి టూర్ రద్దయింది. అయితే ఈ నెల 12న హకీం పేట్‌లో జరిగే సీఐఎస్ఎఫ్ పరేడ్‌కు ఆయన యథావిధిగా హాజరవుతున్నారు. కార్యక్రమం ముగిసిన వెంటనే నేరుగా తిరువనంతపురం వెళ్తారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం.. హకీంపేట కార్యక్రమం ముగించుకుని మధ్యాహ్నం బీజేపీ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో నిర్వహించే మేధావుల సమావేశంలో అమిత్ షా పాల్గొనాల్సి ఉంది. కానీ కేరళలో జరిగిన అత్యవసర సమావేశం కారణంగానే రద్దు చేసినట్లు బీజేపీ శ్రేణులు చెబుతున్నారు. 11వ తేదీ రాత్రి ప్రత్యేక విమానంలో శంషాబాద్ చేరుకుంటారు. అదే రోజు రాత్రి పార్టీ

(మిగతా 2లో)

# అవినాష్ రెడ్డిని సోమవారం వరకు అరెస్టు చేయవద్దు

**ప్రజాతపన , హైదరాబాద్ :**



అవినాష్ రెడ్డిని సోమవారం వరకూ అరెస్ట్‌చేయవద్దని తెలంగాణ హైకోర్టు సీబీఐని ఆదేశించింది. అలాగే కేసు పూర్తి వివరాల ఫైల్‌ను తమ ముందు ఉంచాలని హైకోర్టు ఆదేశించంది. కేసు విచారణలో భాగంగా సేకరించిన ఆడియో, వీడియో గ్రీఫీలను హార్డ్ డిస్క్ రూపంలో తమ ముందు ఉంచాలని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ సోమవారానికి వాయిదా వేసింది. అయితే మంగళవారం అవినాష్ రెడ్డి సీబీఐ కోర్టు ఎదుట హాజరు కావాలని ఆదేశించింది. తనపై తీవ్ర చర్యలు తీసుకోకుండా సీబీఐకి ఆదేశాలివ్వాలని అవినాష్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా అవినాష్ రెడ్డి తరపు లాయర్ ఈ హత్య కేసులో సీబీఐ ఏకపక్షంగా విచారణ జరుపుతోందని వాదిచారు. రెండు దఫాలుగా

(మిగతా 2లో)

# హంగులతో సిద్ధమైన సచివాలయం

### 30న సచివాలయం ప్రారంభం

**ప్రజాతపన , హైదరాబాద్ :**

హైదరాబాద్ లోని కొత్తగా నిర్మించిన సచివాలయాన్ని ఏప్రిల్ 30న ప్రారంభించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. దాంతో పాటు హుస్సేన్ సాగర్ పక్కనే స్మృతి వనాన్ని జూన్ 2న ప్రారంభించేందుకు సీఎం పచ్చజెండా ఊపారు. కొత్త సచివాలయ నిర్మాణ పనులను

(మిగతా 2లో)






## ఇన్‌ఫ్లుయెంజా వైరస్‌తో ఇద్దరు మృతి

**ప్రజాతపన ,బెంగళూరు:**

దేశంలో పలు చోట్ల ఇన్‌ఫ్లుయెంజా వైరస్ కలకలం రేపుతోంది. ఇప్పటికే కొందరు తీవ్ర జ్వరంతో ఆసుపత్రుల పాలవుతున్నారు. ఇప్పుడిప్పుడే కరోనా నుంచి కోలుకుంటున్న ప్రజలను ఈ ఫ్లూ ఆందోళనకు గురి చేస్తోంది. ఇదే కలవర పెడుతుంటే ఇప్పుడు మరో వార్త షాక్‌కు గురి చేసింది. హెచ్3ఎన్2 వైరస్ సోకి ఇద్దరు మృతి చెందారని అధికారులు వెల్లడించారు. కేంద్ర ఆరోగ్య శాఖ ఈ మేరకు అధికారిక ప్రకటన చేసింది. హరియాణాలో ఒకరు, కర్ణాటకలో మరొకరు ప్రాణాలు కోల్పోయారని తెలిపింది. కర్ణాటకలోని హసన్ జిల్లాలో మార్చి 1వ తేదీన 82 ఏళ్ల వృద్ధుడు ఈ వైరస్ సోకి మృతి చెందినట్టు వెల్లడించింది. ఇప్పటి వరకూ దేశవ్యాప్తంగా 90 హెచ్3ఎన్2 వైరస్ కేసులు నమోదయ్యాయి.

(మిగతా 2లో)

# మహిళా రిజర్వేషన్ కోసం పోరాటం




**ప్రజాతపన, న్యూఢిల్లీ:**

హిళా రిజర్వేషన్లు సాధించే వరకు విశ్రమించేది లేదని తెలంగాణ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు దీక్ష కొనసాగించారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్‌తో కవిత ఉద్యమిస్తున్నారు. భారత్ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. జంతర్‌మంతర్‌లో ప్రారంభమైన పోరాటం దేశ వ్యాప్తంగా విస్తరించాలన్నారు. మహిళా బిల్లు చారిత్రక అవసరమని, దానిని సాధించుకోవాలని అన్నారు. బీజేపీ బిల్లు పెడితే అన్ని పార్టీలు మద్దతిస్తాయన్నారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్‌తో ఎమ్మెల్సీ కవిత ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద దీక్ష చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో మహిళలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. అమ్మానాన్నా అంటారు.. ఇందులో అమ్మ అనే శబ్దం ముందుగా వస్తుంది. రాజకీయాల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించాలని స్పష్టం చేశారు. ఈ దీక్షకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు చాలా కాలంగా పెండింగ్‌లో ఉందని, 1996లో ప్రధాని దేవెగౌడ హయాంలో బిల్లు ప్రవేశపెట్టినా ఇంతవరకు చట్టంగా మారలేదన్నారు. ప్రస్తుతం పార్లమెంట్‌లో బీజేపీ ప్రభుత్వానికి పూర్తి మెజారిటీ ఉందని అన్నారు. అందుకే బిల్లు ప్రవేశపెడితే అన్ని పార్టీలు మద్దతిస్తాయి. మహిళా బిల్లు చారిత్రక అవసరమని, దానిని సాధించి తీరాల్సిందేనని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్లు సాధించే వరకు విశ్రమించేది

(మిగతా 2లో)

# భారతీయుల భద్రతకు భరోసా

(మొదటిపేజీ తరువాయి)

రెండు దేశాలు కట్టుబడి ఉన్నాయని వెల్లడించారు. "రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం అనేది చాలా కీలకం. భద్రతా పరంగానూ పరస్పరం సహకరించుకోవాలి. అందుకే ఇండో పసిఫిక్ రీజియన్‌లో రక్షణకు సంబంధించిన అంశాన్ని చర్చించాం. ఆర్థికపరమైన ఒప్పందాలు జరిగేందుకూ ఇరు దేశాలు ఆసక్తి చూపుతున్నాయి"ఆస్ట్రేలియాలోని ఓ ఆలయానికి ఇటీవల బెదిరింపు కాల్స్ వచ్చాయి. మహాశివరాత్రి ఘనంగా జరుపుకోవాలంటే "ఖలిస్థాన్ జిందాబాద్" అని నినాదాలు చేయాలని హెచ్చరించారు ఆగంతకులు. వేడుకలు ప్రశాంతంగా జరగాలంటే ఈ స్లోగన్స్ ఇవ్వాల్సిందేనని బెదిరించారు. బ్రిస్బేన్‌లోని గాయత్రి మందిరానికి ఈ కాల్స్ వచ్చాయి. గతంలోనూ ఆస్ట్రేలియాలో పలు హిందూ ఆలయాలపై దాడి చేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. కొందరు ఇలాగే కాల్స్ చేసి బెదిరించారు. ముఖ్యంగా విక్టోరియా ప్రావిన్స్‌లోని హిందూ ఆలయాలపై దాడి చేశారు. ఖలిస్థానీ మద్దతుదారులు ఆలయ గోడలపై అసభ్యకరంగా రాయడం అలజడి సృష్టించింది. ఆస్ట్రేలియా టుడే చెప్పిన వివరాక ప్రకారం..గాయత్రి మందిర్ అధ్యక్షుడు జై రామ్, ఉపాధ్యక్షుడు ధర్మేశ్ ప్రసాద్‌కు కాల్స్ చేసి బెదిరించాడో వ్యక్తి.. అంతే కాదు తన పేరు గురువదేశ్ సింగ్ అని కూడా చెప్పాడు. హిందువులంతా ఖలిస్థాన్‌కు మద్దతుగా ఉండాల్సిందేనని చెప్పాడు. ఆలయానికి వచ్చిన వాళ్లందరూ ఖలిస్థాన్ జిందాబాద్ అని నినాదాలు చేయాలని అని డిమాండ్ చేశాడు. అటు మెల్‌బోర్న్‌లోనూ ఇదే తరహా ఘటన జరిగింది. ఓ ఆలయ పూజారికి కాల్ చేసిన ఖలిస్థాన్ మద్దతు దారులు బెదిరించారు. ఆలయం మూసేయాలని, పూజలు కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు.

# హైదరాబాద్ కు అమిత్ షా

(మొదటిపేజీ తరువాయి)

నేతలతో సమావేశమై తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించనున్నారు. ఫిబ్రవరి 10న నేషనల్ పోలీస్ అకాడమీ పాసింగ్ ఔట్ పరేడ్ లో పాల్గొనేందుకు అమిత్ షా హైదరాబాద్ వచ్చిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా రాష్ట్ర పార్టీ ముఖ్య నేతలతో ప్రత్యేకంగా సమావేశమై రాష్ట్రంలో రాజకీయ పరిస్థితిపై నేతలను అడిగి తెలుసుకున్నారు. గత నెల చివరి వారంలో ముఖ్య నేతలను ఢిల్లీకి పిలిపించారు. కీలక నేతలంతా సమన్వయంతో ముందుకు సాగాలని? బీఆర్ఎస్ కు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని దిశానిర్దేశం చేశారు.

# అవినాష్ రెడ్డిని సోమవారం వరకు అరెస్టు చేయవద్దు

(మొదటిపేజీ తరువాయి)

అవినాష్ రెడ్డి నుంచి తీసుకున్న స్టేట్మెంట్‌ను పరిగణలోకి తీసుకోవద్దని కోర్టుకు ఆయన తరుపు న్యాయవాది తెలిపారు. జనవరి 28, ఫిబ్రవరి 24వ తారీఖున చేసిన విచారణ స్టేట్‌మెంట్లపై తమకు అనుమానాలు ఉన్నాయని అవినాష్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. సీబీఐ విచారణను ఆడియో, వీడియో రికార్డింగ్ చేయాలని అవినాష్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. విచారణకు పూర్తిగా సహకరిస్తున్నామన్నారు. ఈ రోజు హాజరుకావాలని సీబీఐ నోటీసులు ఇచ్చిందన్నారు. గత రెండుసార్లు జరిపిన విచారణ స్టేట్‌మెంట్స్‌ను పక్కన పెట్టాలని అవినాష్ న్యాయవాది కోరారు. రెండుసార్లు సీబీఐ జరిపిన విచారణ ఆడియో వీడియో రికార్డింగ్ లేకుండా ఉందన్నారు. రెండుసార్లు విచారణ ముగిసిన అనంతరం అవినాష్ రెడ్డి నుంచి సంతకాలు తీసుకోలేదన్నారు. 40 నుంచి 50 సార్లు అవినాష్ రెడ్డి స్టేట్‌మెంట్‌ను సీబీఐ ఎస్పీ రాంసింగ్ ఎడిట్ చేశారన్నారు. అవినాష్ రెడ్డి సంతకం లేనందున స్టేట్‌మెంట్లు మార్చి ఉండొచ్చని అవినాష్ న్యాయవాది కోర్టుకు తెలిపారు. వివేకా హత్య కేసులో అసలు నేరస్థుడు ఆయన అల్లుడు రాజశేఖర్ రెడ్డినే అని పేర్కొన్నారు. అవినాష్ ను విచారణకు పిలిచి అరెస్ట్ చేసే అవకాశం ఉందని అవినాష్ తరుపు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. అందుకే ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలన్నారు. సీబీఐ విచారణ కు పూర్తిగా సహకరిస్తామన్నారు. ఇప్పటి వరకు సహకరించామని.. ఇక ముందు కూడా సహకరిస్తామని అవినాష్ రెడ్డి తరుపు లాయర్ కోర్టుకు వెల్లడించారు. అవినాష్ రెడ్డి దాఖలు చేసిన రిట్‌లో వైఎస్ వివేకానంద రెడ్డి కూతురు సునీత రెడ్డి ఇంప్లీడ్ అయ్యారు. మరో వైపు అవినాష్ రెడ్డి దాఖలు చేసిన రిట్‌లో వైఎస్ వివేకానంద రెడ్డి కూతురు సునీత రెడ్డి ఇంప్లీడ్ అయ్యారు. తనపై వ్యక్తిగతంగా కూడా ఆరోపణలు చేసినందున తమ వాదనలు వినాలని కోర్టును అభ్యర్థించారు. మరో వైపు ఈ కేసు విచారణ కోసం సీబీఐ ఆఫీసుకు ఉదయమే అవినాష్ రెడ్డి హాజరయ్యారు. మూడో సారి విచారణకు హాజరు కావడంతో అరెస్ట్ చేస్తారేమోనన్న ఉద్దేశంతో పులివెందుల నుంచి పెద్ద ఎత్తున అవినాష్ రెడ్డి అనుచరులు తరలి వచ్చారు. హైకోర్టు లో విచారణ జరుగుతున్న సమయంలో సీబీఐ కార్యాలయం వద్ద వారి హంగామా ఎక్కువగా ఉంది. కోర్టు రిలీఫ్ ఇవ్వడంతో సీబీఐ అవినాష్ రెడ్డిని అరెస్ట్ చేసే అవకాశాలు లేవు.

# ఇన్‌ఫ్లుయెంజా వైరస్‌తో ఇద్దరు మృతి



(మొదటిపేజీ తరువాయి)

వీటితో పాటు మరో 8 హెచ్ 1 ఎన్ 1 వైరస్ కేసులూ వెలుగులోకి వచ్చాయి. కొద్ది నెలలుగా బాధితుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. దాదాపు అన్ని ఇన్‌ఫెక్షన్లకూ కారణం... హెచ్3ఎన్2 వైరసేనని వైద్యులు చెబుతున్నారు. దీన్నే హాంగ్ కాంగ్ ఫ్లూ గా పిలుస్తున్నారు. ఈ వైరస్ సోకిన వారే ఎక్కువగా ఆసుపత్రుల పాలవుతున్నారు. ఇప్పటి వరకూ ఈ రెండు వైరస్‌లు మాత్రమే వెలుగులోకి వచ్చాయి. ఈ రెండింటి వైరస్‌ల లక్షణాలు దాదాపు కొవిడ్ సింప్టమ్స్ లానే ఉంటున్నాయి. ఇప్పటి వరకూ ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ఈ వైరస్ బారిన పడ్డారు. 68 లక్షల మంది మృతి చెందారు. రెండు సంవత్సరాల పాటు కరోనా పట్టి పీడించింది. ఇప్పుడు కొత్తగా ఈ వైరస్‌లు దాడి చేస్తున్నాయి. దగ్గు, జ్వరం, చలి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లాంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. కొందరులో ఒళ్లు నొప్పులు, డయేరియా లక్షణాలు కూడా ఉన్నాయి. దాదాపు వారం రోజుల పాటు తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది ఈ వైరస్. దగ్గు, తుమ్ముల ద్వారా చాలా తొందరగా వ్యాప్తి చెందుతుందని వైద్యులు స్పష్టం చేశారు. ఈ వైరస్ సోకిన వ్యక్తికి సన్నిహితంగా ఉన్న వారికీ వ్యాప్తి చెందుతుందని వివరిస్తున్నారు. కొవిడ్‌కు ఎలాంటి జాగ్రత్తలైతే తీసుకున్నారో...అవే ప్రికాషన్స్‌ను కొనసాగించాలని వైద్యులు సూచిస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో దగ్గేటప్పుడు, తుమ్మేటప్పుడు కచ్చితంగా నోరుని కవర్ చేసుకోవాలని ఐసిఎంఆర్ సూచించింది. వృద్ధులకు రిస్క్ ఎక్కువగా ఉండే అవకాశవ ఖందని, వాళ్లు జాగ్రత్తగా ఉండాలని తెలిపింది. ఆందోళనకు గురై వెంటనే యాంటీబయోటిక్స్ వాడొద్దని సూచించింది. వైద్యులు కూడా ఎవరికీ ఈ మందులు ప్రిస్క్రైబ్ చేయొద్దని తేల్చి చెప్పింది. వైరస్‌కు సంబంధించిన పూర్తి వివరాలు తెలియకుండానే ఎక్కువగా ఏ మందులు పడితే అవి వేసుకోవడం మంచిది కాదని వెల్లడించింది.

# హంగులతో సిద్ధమైన సచివాలయం

(మొదటిపేజీ తరువాయి)

కేసీఆర్ పరిశీలించారు. సెక్రటేరియట్ ప్రారంభ తేదీపై అధికారులతో చర్చించారు. మరోవైపు సచివాలయం పక్కనే నిర్మిస్తున్న డా. అంబేద్కర్ విగ్రహాన్ని ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి రోజున ఆవిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సచివాలయమంతా పరిశీలించిన సీఎం కేసీఆర్... త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జూన్ 2 లోపు సెక్రటేరియట్, అంబేద్కర్ విగ్రహం, అమరుల స్థూపం ప్రారంభించాలని ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఆ ప్రకారం వేగంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నూతన సచివాలయాన్ని సంక్రాంతికే ప్రారంభించాలని ప్రభుత్వం ముందు భావించింది. అయితే అప్పటికి సచివాలయ పనులు ఇంకా పూర్తి కాలేదు. దాంతో పాటు బీఆర్ఎస్ ఆవిర్భావ సభ ఏర్పాటు, రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించడంతో సచివాలయ ప్రారంభోత్సవం మొదటిసారి వాయిదా పడింది. ఆ తరువాత కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఫిబ్రవరి 17న ప్రారంభించాలని నిర్ణయించారు. పలువురు ముఖ్యమంత్రుల్ని జాతీయ నేతల్ని కూడా ఆహ్వానించారు. ఇంతలోనే ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. దీంతో ఎన్నికల కోడ్ కారణంగా రెండో సారి ప్రారంభోత్సవం వాయిదా పడింది. ఇప్పుడు ఏప్రిల్ 30వ తేదీని ఖరారు చేశారు. నూతన సచివాలయం చూడగానే నిజాం కాలం నాటి కట్టడాలు కళ్లముందు కదలాడుతాయి. డిజైన్ రూపొందిచడంలో ఇందు కోసం ప్రత్యేక శ్రద్ద



తీసుకున్నారు. దశాబ్దాల కాలంపాటు నిజాం నవాబుల పాలనలో హైదరాబాద్ స్టేట్ ఉంది. ఇప్పుడున్న ప్రభుత్వ కార్యాలయాల్లో అనేక కట్టడాలు ఆనాడు నిజాం ప్రభువులు నిర్మించినవే. అందుకే అలనాటి వైభవానికి ఏమాత్రం తీసిపోకుండా అత్యాధునిక హంగులతో కొత్త సచివాలయం రూపుదిద్దుకుంటోంది. మొత్తం 11.45 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన సచివాలయం నిర్మిస్తున్నారు. ఎత్తు 278 అడుగులు ఉండగా గ్రౌండ్ ఫ్లోర్ తో కలిసి మొత్తం ఏడు ఫ్లోర్లతో మొత్తం నిర్మాణం జరుగుతోంది. రూఫ్ టాప్ లో ఏర్పాటు చేయబోతున్న స్కై లాంజ్ సచివాలయానికి ప్రత్యేక ఆకర్షణగా చెప్పవచ్చు. ఆహ్లాదకరమైన పార్కులతో సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు పటిష్టమైన భద్రత మధ్య సచివాలయం ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నూతన సచివాలయంలో 6వ అంతస్తులో అత్యాధునిక హంగులతో సీఎం చాంబర్ ఉంటుంది. సీఎం కోసం ప్రత్యేక ద్వారం, స్పెషల్ లిఫ్ట్ ఏర్పాటు చేశారు. సచివాలయం నిర్మాణంలో మూడు సింహాల జాతీయ చిహ్నం ప్రధాన ఆకర్షన కానుంది. భవనం ముందు,వెనుక వైపున అమర్చిన ప్రధాన గమ్మటాలపై ఈ మూడు సింహాల జాతీయ చిహ్నం ఏర్పాటు చేశారు. ఢిల్లీ నుండి ప్రత్యేకంగా తెప్పించిన ఈ చిహ్నాలు ఒక్కొక్కటి ఐదు టన్నుల కాంస్య లోహంతో తయారు చేయించారు. అంతే కాదు సందర్శకుల కోసం ప్రత్యేక వెయిటింగ్ హాల్ ఉంటుంది. సచివాలయం ఆవరణలో మందిరం, మసీదు, చర్చిలను కూడా నిర్మిస్తున్నారు. సచివాలయ భవనంముందు విశాలంగా ఉండేలా పచ్చికబయళ్లు, ల్యాండ్ స్కేపింగ్ పనులు సమాంతరంగా జరుగుతున్నాయి. మూడు షిఫ్టుల్లో 24 గంటల పాటు పనులు చేస్తున్నారు.

# మహిళా రిజర్వేషన్ కోసం పోరాటం

(మొదటిపేజీ తరువాయి)

లేదన్నారు. దేశంలోని మహిళలందరినీ కలుపుకుని పోరాటం చేస్తామన్నారు. ధరణిలో సగం, ఆకాశంలో సగం అనే తెలుగు నానుడు ఉన్నాడు. అందుకే సగం అవకాశాలు దక్కించుకోవాలనుకుంటున్నాం. ఈ దీక్షకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు పాస్ చేసేందుకు అన్ని పార్టీలు సిద్ధంగా ఉన్నాయని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ అన్నారు. అయినా మోదీ ప్రభుత్వం ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. 2014 ఎన్నికల మేనిఫెస్టోలో బీజేపీ ఇచ్చిన మాట తప్పిందని విమర్శించారు. ఈ పోరాటం ఇవాల్టిది కాదని, దశాబ్దాలుగా ఈ నినాదాలు వినీవినీ చెవులు చిల్లులు పడుతున్నాయని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో కాంగ్రెస్, బీజేపీలు తప్పు మీదంటే మీదని అనుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీజేపీ ప్రభుత్వం ఒకే వ్యక్తి కోసం పనిచేస్తున్నదని.. అతనే అదానీ అని సంజయ్ సింగ్ ఆరోపించారు. ఆకాశం నుంచి పాతాళం వరకు అన్నీ అదానీ పేరుమీదే రాసిస్తున్నారని విమర్శించారు. అదేమని అడిగితే ఈడీలను, సీబీఐలను ప్రయోగిస్తున్నారని చెప్పారు. ఈడీలు, సీబీఐలు తమను ఏం చేయలేవని స్పష్టం చేశారు. తామెవరికీ భయపడే రకం కాదని వెల్లడించారు. దేశంలో రైతులు దుఖ పడుతున్నారని, మహిళలకు రక్షణ లేదని విమర్శించారు. దేశంలోని పేదలకు సాయం చేయడానికి మోదీకి చేతులు రావని చెప్పారు. బీజేపీ కండువా కప్పుకుంటే చాలు తప్పులన్నీ మాఫీ అయిపోతాయని ఎద్దేవా చేశారు. ఆ పార్టీలో ఉన్నవాళ్లంతా సత్యహరిశ్చంద్రులా అని ప్రశ్నించారు. ఈడీ, సీబీఐ నాటకాలు ఇప్పటికైనా బంద్ పెట్టాలని హితవు పలికారు.

## మహిళా బిల్లు ఆవశ్యం

మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందే వరకు వామపక్ష పార్టీల మద్దతు ఉంటుందని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. మహిళా రిజర్వేషన్ కోసం చేసే పోరాటంలో పాల్గొంటామని ప్రకటించారు. మహిళలకు భాగస్వామ్యం లేనంత వరకు సమాజం ముందుకు పోదని చెప్పారు. . దీక్షకు హాజరైన సీపీఎం నేత సీతారాం ఏచూరి.. కవితకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కవిత ఒక మంచి అడుగు వేశారని చెప్పారు. ఎన్నో అడ్డంకుల తర్వాత మహిళా రిజర్వేషన్ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది, కానీ లోక్‌సభ ఆమోదముద్ర వేయలేదని చెప్పారు. పార్లమెంట్ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు. గతంలో మహిళా రిజర్వేషన్ బిల్లుకు మోదీకూడా మద్దతు తెలిపారని గుర్తుచేశారు. ఆయన ప్రధానమంత్రి అయి తొమ్మిదేండ్లు పూర్తయినా ఇప్పటివరకు లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టలేదని విమర్శించారు. ప్రస్తుత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకురావాలని పట్టుబడతామని చెప్పారు. మ్మెల్సీ కవితకు నరేష్ గుజ్రాల్ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొదటిసారి 1996లో పార్లమెంటు ముందుకు మహిళా బిల్లు వచ్చిందని, అన్ని పార్టీలు సమర్థించాయి కానీ ఎందుకో ఆమోదం పొందలేదని చెప్పారు. బీజేపీ తన మేనిఫెస్టోలో బిల్లు తెస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రధాని మోదీ ఆగస్టు 15న ఎర్రకోట లో మహిళా శక్తి గురించి గొప్పగా మాట్లాడుతారని, కానీ మహిళా రిజర్వేషన్ బిల్లును మాత్రం లోక్‌సభలో ప్రవేశపెట్టరని విమర్శించారు. ఎమ్మెల్సీ కవిత పోరాటానికి అకాలీదళ్ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు.

# రైతు కంట తడి పెట్టిస్తున్న ఉల్లి

**ప్రజాతపన , హైదరాబాద్ :**

నిన్నమొన్నటి వరకు చుక్కల్లో ఉన్న ఉల్లి ధర పంట చేతికి వచ్చే సమయంలో పడిపోయింది. పెట్టుబడులు కూడా తిరిగిరాని పరిస్థితులు నెలకొన్నాయి. ఉల్లి సాగుతో లాభాలు సాధించవచ్చని అప్పులు చేసి పంటను సాగు చేస్తే పంట చేతికందాక ధరలు పడి పోవడంతో రైతులు కంటతడి పెడుతున్నారు. ప్రస్తుత దరలకు విక్రయిస్తే పెట్టుబడులు కూడా తిరిగిరావని వాపోతున్నారు. సంగారెడ్డి జిల్లాలోనే నారాయణఖేడ్ ప్రాంతం ఉల్లి సాగుకు ప్రసిద్ధి. ఈ ప్రాంతంలో నల్లరేగడి భూములు ఉండడంతో నాణ్యమైన ఉల్లి పండుతుంది. ఇక్కడ పండిన పంటకు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్టణం, రాజమండ్రి మార్కెట్లలోను మంచి డిమాండ్ ఉంటుంది.

## ఖర్చు అధికం

ఈసారి ఉల్లి సాగుకు పెట్టుబడి భారీగా పెరిగింది. ఒక ఎకరాలో ఉల్లిని సాగు చేసేందుకు విత్తనాలకే రూ.15 వేలు ఖర్చు చేశారు. ఎకరాకు మూడు కిలోలు విత్తనం అవసరమవుతుంది. కిలో విత్తనం రూ. 5వేల చొప్పున మహారాష్ట్ర నుంచి రైతులు దిగుమతి చేసుకున్నారు. ఎకరా దుక్కిదున్ని నాట్లు వేయడానికి ఎకరాకు రూ.15 వేలు ఖర్చు చేశారు. రెండుసార్లు కలుపు తీసేందుకు రూ.10 వేలు, ఎరువులు, క్రిమిసంహారక మందులకు రూ.10 వేలు,



పంటను తీయడానికి రూ.15 వేలు చేశారు. పంటను హైదరాబాద్ లేదా ఇతర రాష్ట్రాల మార్కెట్లకు తరలించడానికి ఎకరాకు రూ. 5వేలకు పైగా ఖర్చవుతుంది. ఈ లెక్కన ఎకరా విస్తీర్ణంలో ఉల్లి సాగు చేసేందుకు రైతుకు రూ. 70 వేల వరకు ఖర్చు అయ్యింది.

## పెరిగిన సాగు విస్తీర్ణం

గతంలో కంటే ఈ సంవత్సరం అధిక విస్తీర్ణంలో ఉల్లి సాగు చేశారు. గత సంవత్సరం ఖేడ్ డివిజన్‌లో దాదాపు 1,200 ఎకరాల్లో ఉల్లిపంటను సాగు చేస్తే, ఈ సంవత్సరం 1,400 ఎకరాల్లో సాగు చేశారు. జనవరి నెలలో నాణ్యమైన ఉల్లిగడ్డ క్వింటాలుకు హోల్‌సేల్‌లో రూ.2వేల నుంచి రూ. 2,500ల వరకు ధర పలికింది. ఆ తరువాత నుంచి ధర తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.500 కూడా పలకడం లేదు.

## ఆరుగాలం కష్టం వృథా

ఎకరాలో విస్తీర్ణంలో ఉల్లి దిగుబడి 70–100 క్వింటాళ్ల వరకు వచ్చింది. సాధారణ పరిస్థితుల్లో ఎకరాకు రూ. 2 లక్షల వరకు ఆదాయం వచ్చేది. కానీ ప్రస్తుతం ఉన్న ధరలకు ఎకరాకు రూ. 40వేల నుంచి రూ. 50వేల వరకు మాత్రమే వస్తున్నది. దీంతో పెట్టుబడులు కూడా తిరిగిరావడం లేదు. ఎకరాకు రూ. 20వేలకు పైగా నష్టం వస్తున్నది. పంట పండించడానికి రైతులు ఆరు నెలలు చేసిన కష్టం వృథాగా పోతున్నది. నెలన్నర క్రితం వరకు ధరలు లాభసాటిగానే ఉన్నాయని, తాము పండించిన పంటను విక్రయించడానికి తీసుకెళ్లే క్రమంలోనే ధర పడిపోయిందని రైతులు వాపోతున్నారు. కుటుంబాలను ఎలా పోషించుకోవాలో.. సాగుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదని రైతులు వాపోతున్నారు. ధర పెరిగే వరకు నిల్వ ఉంచుకోవడానికి ఈ ప్రాంతంలో కోల్డ్‌స్టోరేజీలు, గోదాములు అందుబాటులో లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర ఇప్పించాలని రైతులు కోరుతున్నారు

ప్రజా తపన
prajathapana.com
News that matters

# సైకిల్ ఎక్కుతున్న కామ్రేడ్స్

**ప్రజాతపన :విజయవాడ :**

ఏపీలో ఎమ్మెల్సీ ఎన్నికలు కొత్త పొత్తులకు దారి తీసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సహకరించుకోవాలని లెఫ్ట్ పార్టీలు, టీడీపీ నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది. వైఎస్ఆర్‌సీపీని ఓడింటి తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు తెలుగుదేశం, వామపక్షాలు కలిసి పని చేయాలని నిర్ణయించకున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పరస్పర సహకారంపై ఈ పార్టీల మధ్య ఓ అవగాహన కుదిరింది. మూడు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలు, రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పదవులకు ఈ నెల 23న పోలింగ్ జరుగనుంది. ఇందులో టీడీపీ మూడు పట్టభద్ర స్థానాలకు బరిలోకి దిగింది. ఉపాధ్యాయ స్థానాలకు మాత్రం పోటీ చేయడం లేదు. ఉభయ కమ్యూనిస్టు పార్టీల అనుబంధ ఉపాధ్యాయ సంఘాలు పీడీఎఫ్ కూటమిగా ఏర్పడి పట్టభద్ర, ఉపాధ్యాయ స్థానాలన్నింటిలోనూ పోటీ చేస్తున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించాలంటే.. సాదారణ ఎన్నికల్లోలా మెజార్టీ చూడరు. యాభై శాతం ఓట్లు ఖచ్చితంగా తెచ్చుకోవాలి. ఇందుకోసం భిన్నమైన కౌంటింగ్ ప్రక్రియ ఉంటుంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాధాన్య ఓట్లు ఉంటాయి. ఓటరు తనకు బాగా నచ్చిన వారికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి మిగిలిన వారికి రెండో ప్రాధాన్య ఓటు.. మూడో ప్రాధాన్య ఓటు వేయవచ్చు. ఓట్ల లెక్కింపులో మొదటి ప్రాధాన్య ఓట్ల ద్వారా ఏ అభ్యర్థి గెలవకపోతే రెండో ప్రాధాన్య ఓట్లు, ఆ తర్వాత మూడో ప్రాధాన్య ఓట్లు కూడా లెక్కిస్తారు. అన్నీ కలిపి ఎవరికి ఎక్కువ వస్తే వారు గెలిచినట్లు ప్రకటిస్తారు. మొదటి ప్రాధాన్య ఓట్లు చాలినన్ని ఎవరికీ రాకపోతేనే మిగిలిన రౌండ్ల లెక్కింపు జరుగుతుంది. అందుకే రెండో ప్రాధాన్య ఓట్లు కూడా కీలకంగా మారాయి. వైఎస్ఆర్‌సీపీ మొత్తం పట్టభద్ర, ఉపాధ్యాయ స్థానాల్లో పోటీ చేస్తోంది. ఆ పార్టీ అభ్యర్థులు ఎక్కడా గెలవకుండా చేసేందుకు పరస్పరం సహకరించుకోవడానికి టీడీపీ, వామపక్షాలు ప్రయత్నిస్తున్నాయి. పట్టభద్ర స్థానాల్లో రెండో ప్రాధాన్య ఓట్లు పరస్పరం వేసుకుందామని, దీనికి బదులుగా ఉపాధ్యాయ స్థానాల్లో తమకు మద్దతివ్వాలని వామపక్షాలు టీడీపీని కోరినట్లుగా తెలుస్తోంది. దీనికి టీడీపీ ప్రతినిధులు కూడా అంగీకరించినట్లుగా తెలు?సతోంది. పట్టభద్ర స్థానాల్లో వామపక్షాలు మొదటి ప్రాధాన్య ఓటును తమ వారికి వేసుకుని రెండో ప్రాధాన్య ఓటును టీడీపీకి వేస్తాయి. అలాగే టీడీపీ కూడా మొదటి ప్రాధాన్య ఓటును తనకు వేసుకుని రెండో ప్రాధాన్య ఓటును వామపక్షాల అభ్యర్థులకు వేస్తుంది. దీనికి బదులుగా ఉపాధ్యాయ స్థానాల్లో పీడీఎఫ్ అభ్యర్థులను టీడీపీ బలపరచాలని ఆ పార్టీలు కోరాయి. ఈ ప్రతిపాదనకు అనుగుణంగా తమ మద్దతు టీడీపీ అభ్యర్థులకు ఉంటుందని.. ఏ క్షణమైనా ఈ అంశంపై రెండు పార్టీలు ప్రకటన చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. వామపక్ష పార్టీలు కొంత కాలంగా వైఎస్ జగన్ ప్రభుత్వంపై పోరాడుతున్నాయి. అయితే ఎప్పుడూ పొత్తుల ప్రస్తావన రాలేదు. కలసి పని చేయాలన్న ఆలోచన కూడా చేయలేదు. స్థానిక ఎన్నికల్లోనూ ఎవరికి వారు పోటీ చేశారు. ఇప్పుడు వామపక్షాలు కూడా తెలుగుదేశం పార్టీతో కలిసేందుకు సిద్ధం కావడంతో... ఎమ్మెల్సీ ఎన్నికల్లో వీరి సహకారం.. కలిసి వస్తే.. తదుపరి సాధారణ ఎన్నికల్లో ఇలాంటి సహకారంపై చర్చించే అవకాశం ఉంటుంది. అదే జరిగితే.. మహాకూటమి తరహాలో టీడీపీ, జనసేన, లెఫ్ట్ పార్టీల కూటమి ఏర్పడే అవకాశం ఉంటుంది.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలపై టీడీపీ దృష్టి

**ప్రజాతపన :విజయవాడ :**

అందుకే తెలుగుదేశం పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలపై దృష్టి పెట్టింది. చంద్రబాబు మూడు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ ఎన్నికల్లో పట్టు సాధించి ఎలాగైనా తమ పార్టీ నేతలను మండలికి తీసుకురావాలని భావిస్తున్నారు. సాధారణ ఎన్నికలకు ముందు ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తే చాలా రకాలుగా పార్టీకి ఉపయోగపడుతుంది. ఒకటి ప్రభుత్వంపై వ్యతిరేకత అంచనాను వేయడానికి ఈ ఎన్నికలు ఉపయోపడతాయి. మరొకటి పొత్తులతో వచ్చే పార్టీల అధిక సీట్లు కోరకుండా తమ బలమేంటో చెప్పుకునేందుకు వీలుంటుంది. రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాత్రం టీడీపీ ఏపీ?టీఫ్‌కు మద్దతు ప్రకటించింది. పశ్చిమ రాయలసీమ పరిధిలోని కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి టీడీపీ తరుపున భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. తూర్పు రాయలసీమకు సంబంధించి చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లా అభ్యర్థిగా కంచర్ల శ్రీకాంత్ ఉన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి జరుగుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వేపాడ చిరంజీవిరావును బరిలోకి దించారు. అయితే మూడు ప్రాంతాల్లో ఎన్నికలు జరుగుతుండటంతో ఖచ్చితంగా గెలిచి తీరాలని చంద్రబాబు నియోజకవర్గ ఇన్‌ఛార్జులకు లక్ష్యాన్ని నిర్దేశించారు. ముగ్గురు అభ్యర్థులను గెలిపించుకునేలా వ్యూహాలను రూపొందించుకోవాలని కోరారు. ప్రస్తుత ప్రభుత్వంపై యువతలో వ్యతిరేకత ఎక్కువగా ఉందని తెలుగుదేశం పార్టీ అంచనా వేస్తుంది. నిరుద్యోగ సమస్య పెరిగి పోవడం, పరిశ్రమలు రాకపోవడం, ఉపాధి అవకాశాలు తగ్గడం వంటి కారణాలతో గ్రాడ్యుయేట్లు తమకు అండగా నిలుస్తారని భావిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగులు కూడా తమకు అండగా నిలుస్థారన్న భరోసాలో చంద్రబాబు ఉన్నారు. ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తే యువతతో పాటు ఉద్యోగులు కూడా తమవైపే ఉన్నారన్నది స్పష్టమయ్యే అవకాశముంది. ఈ అవకాశం ద్వారా తమకు రాజకీయంగా రానున్న కాలంలో అనేక ప్రయోజనాలు వాటంతట అవే దక్కుతాయని భావిస్తున్నారు. అందుకోసం తరచూ టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ నేతలను చంద్రబాబు అప్రమత్తం చేస్తున్నారు.

# 2 లక్షల నుంచి 5 లక్షలు...

## పిల్లల ముఠాలో కొత్త విషయాలు

**ప్రజాతపన :విజయవాడ :**

మహరాష్ట్రలో అదృశ్యమైన బాలుడు ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో దొరికిన కేసులో కూపీ లాగిన పోలీసులకు షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసులో అరెస్ట్ అయిన పగడాల శ్రావణి, శిల్ప ఇచ్చిన సమాచారంతో కేసులో మరిన్ని కోణాలను పోలీసులు వెలికితీశారు. మరో ముగ్గురు పిల్లలను కూడా అమ్మేసినట్టు తేలింది. ఈ ముఠా స్కెచ్‌లు విన్న పోలీసులకే మైండ్ బ్లాంక్ అయింది. సంతానం లేని దంపతులు, లోపాలు ఉన్న సంతానం కలిగిన తల్లిదండ్రులే టార్గెట్‌గా ఈ ముఠా వ్యాపారం చేసింది. ఇలా ఉమ్మడి కృష్ణా జిల్లాలలో నలుగురు పిల్లలను పోలీసలు గుర్తించారు. వారిని తీసుకొచ్చి అసలు తల్లిదండ్రులకు అప్పగించారు. హైదరాబాద్‌లోని ఐవీఎఫ్ సెంటర్‌లకు ఎగ్ డోనర్ ఏజెంట్‌గా పని చేస్తోంది శ్రావణి, గుజరాత్‌కు చెందిన రంజిత అలియాస్ సుల్తానాతో కలిసి ఈ దందా సాగిస్తోంది. ఆమె సికింద్రాబాద్‌లో ఉంటున్న సుల్తానా, నూర్జాహాన్, షమీరాతో కలిసి ముఠాగా ఏర్పడి పిల్లలను విక్రయించేవాళ్లు. ఈ ముఠా విక్రయించిన పిల్లలను పోలీసులు వెతికి పట్టుకున్నారు. బ్రాహ్మణ బజారులో ఉంటున్న జయలక్ష్మి అనే మహిళ కు ఓ బాలుడిని అమ్మారు. ఇంకో వ్యవసాయ కుటుంబానికి మరో బాలుడిని అమ్మారు. వాళ్లకు ఉన్న సంతానం మానసిక వికలాంగులు కావడంతో వాళ్లకు ఓ బిడ్డను అమ్మారు. మరో ఫ్యామిలీలో అంతా ఆడపిల్లలనే అన్న కారణంతో మరో బిడ్డను కొనుగోలు చేసింది.విక్రయంలో ఈ ముఠా చాలా తెలివిగా వ్యవహరించింది. వారి వారి కొనుగోలు శక్తిని బట్టి పిల్లలను విక్రయించే వాళ్లు. రెండు లక్షల రూపాయల నుంచి ఐదు లక్షల వరకు పిల్లలను అమ్మేవాళ్లు. ఇలా అమ్మేటప్పుడు కొనేవాళ్లకు అనుమానం రాకుండా ఉండేలా... రకరకాల కారణాలు చెప్పేవాళ్లు. తల్లిదండ్రులు చనిపోయారని... సంతానం ఎక్కువై పెంచలేకపోతున్నారని మరికొందరికి చెప్పేవాళ్లు. మహారాష్ట్రలోని పర్భానీలో చిన్నారుల కిడ్నాప్‌లు ఎక్కువ ఉండటంతో అక్కడి పోలీసులకు అనుమానం వచ్చింది. అసలు ఏం జరుగుతోందని నిఘా పెట్టారు. దీంతో తీగ లాగితే ఉమ్మడి కృష్ణా జిల్లాలో డొంక కదిలింది.ముంబయిలో కిడ్నాప్ అయిన బాలుడు ఏడాది తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జగ్గయ్యపేట ప్రాంతంలోని దేవుపాలెం గ్రామంలో ప్రత్యక్షమయ్యాడు. జగ్గయ్యపేటలోని ఒక ప్రైవేట్ స్కూలులో ప్రస్తుతం ఆ బాలుడు చదువుతున్నాడు. ముంబయిలో 2022లో బాలుడు కిడ్నాప్‌కు గురైనట్లుగా కుటుంబ సభ్యులు అక్కడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణలో అక్కడ పోలీసులకు విజయవాడకు చెందిన మహిళ బాలుడిని తీసుకువెల్లినట్లుగా గుర్తించారు. ఆమె బాలుడిని జగయ్యపేటలోని ఓ మహిళకు 2లక్షల రూపాయలకు అమ్మేసింది. ఆమె దేవుపాలెంలోని తమ బంధువులకు మూడు లక్షల రూపాయలకు బాలుడిని ఇచ్చేసింది. అప్పటి నుంచి అదే కుటుంబంలో పెరుగుతున్న ఆ బాలుడు జగ్గయ్యపేటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. అంతా వారి పిల్లాడే అనుకుంటున్న టైంలో పోలీసులు వచ్చి ఆ బాలుడిని తీసుకెళ్లిపోయారు. మహారాష్ట్రకు చెందిన ఫ్యామిలీ బిడ్డగా చెప్పడంతో అంతా ఆశ్చర్యపోయారు. పాఠశాల వార్షికోత్సవంలో సందడి చేస్తున్న సదరు బాలుడిని పోలీసులు గుర్తించి తీసుకెళ్లారు. ఆధారాలతో పోల్చి చూశారు. మహారాష్ట్ర పోలీసులు, స్థానిక పోలీసులు మాట్లాడుకొని గతంలో కిడ్నాప్ అయిన బాలుడు ఈ బాలుడు ఒక్కడే అని నిర్ధారణకు వచ్చారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు బాలుడిని అక్కడి నుంచి తీసుకెళ్లిపోయారు. ఎస్ఐ రామారావు సహకారంతో మహారాష్ట్ర పోలీసులు కేసు పత్రాలు చూపించి, బాలుడిని తీసుకెళ్లిపోయారు. ఏడాదిగా పెంచుకుంటున్న బాలుడిని హఠాత్తుగా పోలీసులు తీసుకువెళ్ళిపోవటంతో పెంచుకున్న తల్లి, కుటుంబ సభ్యులు బోరుమంటున్నారు. ఈ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ కేసులో కిడ్నాప్ చేసిన విజయవాడకు చెందిన మహిళ శ్రావణి, మధ్యవర్తిగా వ్యవహరించిన జగ్గయ్యపేటకు చెందిన మరో మహిళను అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. వాళ్లను విచారించడంతో బాలుడి ఆచూకీ లభించిందని, పూర్తి సమాచారం సేకరించి, కేసుకు సంబందించిన ఎఫ్ఐఆర్ పత్రాలు, ఇతర వివరాలు తెలుసుకొన్న తరువాతే బాలుడిని మహారాష్ట్ర పోలీసులకు అప్పగించారు.

# మరాఠలో ట్రాన్స్ జెండర్ల కాలమ్

**ప్రజాతపన ముంబై:**

మహారాష్ట్రలో విద్య, ఉద్యోగాల్లో ప్రవేశాలకు సంబంధించిన దరఖాస్తుల్లో, ఇతర సంబంధిత ప్రొఫార్మాలలో లింగ నిర్ధారణకు సంబంధించి స్త్రీ , పురుష ఆప్షన్లతో పాటు ట్రాన్స్ జెండర్ ఆప్షన్ ను కూడా పొందుపర్చనున్నట్లు మహారాష్ట్ర ప్రభుత్వం బొంబాయి హై కోర్టుకు తెలిపింది.విద్యా సంస్థల్లో అడ్మిషన్లకు సంబంధించిన దరఖాస్తుల్లో, ఉద్యోగ భర్తీకి సంబంధించిన దరఖాస్తుల్లో ఇకపై లింగ నిర్ధారణకు సంబంధించి మూడు ఆప్షన్లు ఉంటాయని మహారాష్ట్ర ప్రభుత్వం బొంబాయి హై కోర్టుకు తెలిపింది. అవి స్త్రీ , పురుష ఆప్షన్లతో పాటు ట్రాన్స్ జెండర్ ఆప్షన్లు అని వివరించింది. దీనికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను వారం రోజుల్లో జారీ చేస్తామని తెలిపింది. అప్లికేషన్ ఫామ్ లో లింగ నిర్ధారణకు సంబంధించి స్త్రీ, పురుష అనే రెండు ఆప్షన్లు మాత్రమే ఉండి, ట్రాన్స్ జెండర్ ఆప్షన్ లేకపోవడంతో మహారాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ రంగ విభాగం మహా ట్రాన్స్ కో లో అసిస్టెంట్ ఇంజినీర్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోలేకపోయానని ఒక ట్రాన్స్ జెండర్ దాఖలు చేసిన పిటిషన్ పై మహారాష్ట్ర ప్రభుత్వం పై విధంగా స్పందించింది.బొంబాయి హైకోర్టుకు మహారాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వివరణ కారణంగా మరో సమస్య కూడా పరిష్కారమైంది. పోలీసు విభాగంలో ఉద్యోగాల భర్తీకి సంబంధించిన అప్లికేషన్లలో థర్డ్ జెండర్ ఆప్షన్ ను కూడా చేర్చాలని మహారాష్ట్ర అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ ఇచ్చిన ఆదేశాలను గతంలో మహారాష్ట్ర ప్రభుత్వం కోర్టులో సవాలు చేసింది. తాజాగా, ఇక అన్ని ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ దరఖాస్తుల్లో, విద్యా సంస్థల్లో ప్రవేశాలకు సంబంధించిన దరఖాస్తుల్లో థర్డ్ జెండర్ ఆప్షన్ ఉండేలా ఆదేశాలు జారీ చేస్తామని మహారాష్ట్ర ప్రభుత్వం బొంబాయి హై కోర్టుకు తెలిపింది. మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం కారణంగా మహారాష్ట్ర అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ ఆదేశాలను సవాలు చేస్తూ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ రద్దు అవుతుంది. అంటే, ఇకపై మహారాష్ట్ర పోలీస్ విభాగంలో ఉద్యోగాల కోసం, తాము ట్రాన్స్ జెండర్లమని స్పష్టం చేసి మరీ, ట్రాన్స్ జెండర్స్అప్లై చేసుకోవచ్చు.

# మూడు రోడ్డు ప్రమాదాలు..ఇద్దరు మృతి

**ప్రజాతపన విజయవాడ**

రాష్ట్రంలో శుక్రవారం ఉదయం జరిగిన మూడు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. పలువురికి గాయాలయ్యాయి. ప్రకాశం జిల్లా మార్కాపురం లోని కంభం రోడ్ లో బ్రహ్మంగారి గుడి వద్ద శివశక్తి ట్రాన్స్పోర్ట్ లారీ ఒక వ్యక్తి మీదకు ఎక్కియడంతో వ్యక్తి మృతి చెందాడు. మృతుడు మీసాల మీరావలి (45) ఎస్ అర్ ఎం టీ లారి డ్రైవర్ కర్నూలు పట్టణవాసి.మరో ఘటన గుంటూరు జిల్లా పొన్నూరు దగ్గర జరిగింది. ఐజీ త్రివిక్రమ వర్మ క్యాంప్ క్లర్క్ ప్రయాణిస్తున్న కారు బోల్తా పడింది. నిడుబ్రోలు, ఇంటూరు మద్య కారు కాలవలోకి దూసుకెళ్ళింది. కారులో నలుగురు ప్రయాణిస్తున్నారు వారిలో ఇద్దరకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను పొన్నూరు లోని ప్రవేటు హాస్పటల్ కు తరలించారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం శివదేవుని చిక్కాల గ్రామంలో కారు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ప్రమాదంలో ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలు పాలకొల్లు పట్టణానికి చెందిన బుద్ద చంద్రావతి(80)గా గుర్తించారు. ఒక వివాహానికి హాజరై తిరిగి వస్తుండగా ఈరోజు ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది.

# గ్రామ సచివాలయాల్లో భారీ ఖాళీలు... 10 శాతమే భర్తీ

**ప్రజాతపన :విజయవాడ :**




ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాలనా వ్యవహారాలను ప్రజలకు చేరువ చేసేందుకు ప్రారంభించిన గ్రామ, వార్డు సచివాలయ విభాగంలో పెద్ద ఎత్తున ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఇప్పటికే సచివాలయాల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. విభాగాల వారీగా ఎన్ని ఖాళీలు ఉన్నాయో ఇటీవల లెక్కించారు. రాష్ట్ర వ్యాప్తంగా 13,995 ఉద్యోగాలు వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. ముఖ్యమైన విభాగాల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. గ్రామ వార్డు సచివాలయాలను మరింత బలోపేతం ?యడానికి అవసరమైన చర్యలపై దృష్టి సారిస్తోంది.ఉద్యోగాల భర్తీకి సంబంధించి అన్ని ప్రభుత్వ శాఖలకు స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సచివాలయాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల్లో ఎక్కువగా పశు సంవర్థక శాఖలోనే ఉన్నట్లు గుర్తించారు. పశు సంవర్ధక శాఖలో 4,765 పశు సంవర్ధక సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విద్యుత్ శాఖలో గ్రేడ్ 2 విభాగాల్లో 1127 ఖాళీలు ఉన్నాయి. ఉద్యానవన సహాయకుల పోస్టులు 1496ఖాళీ ఉన్నాయి. గ్రేడ్ 3 మహిళా పోలీస్ పోలీస్ పోస్టులు 1092 ఖాళీగా ఉన్నాయి గ్రామ సర్వేయర్ పోస్టులు 1027 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.గ్రామ,వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో వేటిని త్వరగా భర్తీ చేయాలి, ఏ ఉద్యోగాలతో ప్రజలతో అవసరం ఉంటుందనే ప్రాతిపదికన ఉద్యోగాలను భర్తీ చేయాలని ప్రభుత్వం సూచించింది. ఏ శాఖలో నియామకాలు అవసరం లేదనే దానిపై ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. మహిళా పోలీస్, గ్రామ సర్వేయర్ విభాగంలో సహాయక పోస్టులు, మునిసిపల్ పట్టణాభివృద్ధి శాఖ పరిధిలోకి వచ్చే వార్డు సౌకర్యాల కార్యదర్శులు, ప్లానింగ్, రెగ్యులేటరీ కార్యదర్శులు, పారిశుద్యం, పర్యావరణ కార్యదర్శులు, విద్యా, వార్డు అడ్మినిస్ట్రేషన్, వెల్ఫేర్ సెక్రటరీ పోస్టుల్ని ప్రస్తుతం భర్తీ చేయకూడదని నిర్ణయించారు. వీటిలో దాదాపు 3,905 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరికొన్ని పోస్టుల్ని భౌగోళిక అవసరాలు, స్థానిక ప్రాధాన్యతల ఆధారంగా భర్తీ చేయాలని నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహిస్తున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాలకు ఇప్పటికీ జాబ్ ఛార్టును ఖరారు చేయలేదు. వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారుల వద్దే జాబ్ చార్టులకు సంబందించిన జాబితా పెండింగ్‌లో ఉందని అధికారులు చెబుతున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న వెల్ఫేర్ విభాగానికి ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లను ఎలా వినియోగించాలో తెలియక అంతర్గత నివేదిక కోసం కమిటీ ఏర్పాటు చేసి వదిలేశారు. కమిటీ నివేదిక ఇవ్వకపోవంతో వారికి జాబ్ ఛార్ట్ తయారు కాలేదని తెలుస్తోంది.వ్యవసాయం, ఉద్యానవనం, విద్యుత్, అంగన్‌వాడీ పోస్టులకు సంబంధించిన జాబ్ ఛార్టుల అంశం అయా శాఖాధికారుల వద్దే పెండింగ్‌లో ఉంది. శాఖల వారీ ఖాళీల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్ విభాగంలో 982 ఖాళీలు, పంచాయితీ అసిస్టెంట్ ఉద్యోగాల్లో 731 ఖాళీలు, సంక్షేమం- ఎడ్యుకేషన్ అసిస్టెంట్ విభాగంలో 543 ఖాళీలు, వార్డు ఎమినిటిస్ విభాగంలో 459 ఖాళీలు, వార్డు ప్లానింగ్ విభాగంలో 439 ఖాళీలు ఉన్నాయి.

# యాదాద్రి జిల్లాకు కాళేశ్వరం నీరు

**భువనగిరి**



రాష్ట్ర అటవీ అభివృద్ధి శాఖ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, ప్రభుత్వ విప్ సునీత లు శుక్రవారం నాడు యాదాద్రి భువనగిరి జిల్లాకు కాళేశ్వరం నీళ్లను విడుదల చేసారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని దామరకుంట వద్ద గోదావరి జలాలను ఎం. తుర్కపల్లి ప్రధాన కాల్వ క్రాస్ రెగ్యులేటర్ దవారా విడుదల చేసారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఫలాలు జిల్లాను సస్యశ్యామలం చేసుకుంటూ వస్తున్నాయి. ఇప్పటికే బస్వాపూర్ (నృసింహ సాగర్) రిజర్వాయర్ ద్వారా యాదగిరిగుట్ట క్షేత్రానికి గోదావరి జలాలు చేరుకోగా, ఇక ఆలేరు నియోజకవర్గంలోని భూములను తడిపేందుకు పరుగులు పెడుతూ వస్తున్నాయి. 2020 సంవత్సరంలోనే కొండపోచమ్మ సాగర్ నుంచి తుర్కపల్లి ప్రధాన కాల్వ ద్వారా తుర్కపల్లి, బొమ్మలరామారం మండలాలకు సాగు నీరు మొదలవగా, తాజాగా మన్నెవారి తుర్కపల్లి ప్రధాన కాల్వ సైతం సిద్ధమైంది. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం దామరకుంట రెగ్యులేటర్ వద్ద శుక్రవారం ఈ కాల్వలోకి ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్రెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్రెడ్డి నీటిని విడుదల చేసారు. దీని ద్వారా తుర్కపల్లి, బొమ్మలరామారం మండలాల్లో 868 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనున్నది. 20 చెరువులను నింపనున్నది.

## ఆడవి పందుల సంచారం

## ట్రాక్టర్ బోల్తా పడి కూలీలకు గాయాలు

**ప్రజాతపన జనగామ**



జనగామ జిల్లా పాలకుర్తి మండలం ముత్తారం గ్రామ శివారు వద్ద అడవిపందులు హల్ చల్ చేసాయి. ఒక్కసారిగా పందులు రోడ్డుకు అడ్డం రావడంతో కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ కరెంట్ హై టెన్షన్ పోల్ ఢీకొట్టి బోల్తా పడింది. ఘటనలో బీహార్ కు చెందిన ఆరుగురు కూలీలకు గాయాలు అయ్యాయి. ఒక పంది చనిపోయింది. గాయపడిన వారిని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

## ఎమ్మెల్యే రాజయ్యపై మహిళా సర్పంచ్ ఫైర్

**ప్రజాతపన హన్మకొండ**

స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే రాజయ్యపై మహిళా సర్పంచ్ తీవ్ర ఆరోపణలు చేయడం అటు పార్టీలో, ఇటు జిల్లాలో కలకలం రేపింది. ఎమ్మెల్యే తనకు పార్టీలో తగిన గుర్తింపు, గౌరవం ఇవ్వకుండా వేధిస్తున్నారని ఆరోపించింది. ఎమ్మెల్యే, అనుచరులు చేసే తప్పుడు పనులవల్ల బీఆర్ఎస్ పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని ఆవేదన వ్యక్తం చేసింది. ఓట్లు వేసిన ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు తగిన విలువ ఇవ్వడంలేదని విమర్శించింది. చేసిన పనులకు బిల్లులు రాక ఒంటిపై బంగారం, ఆస్తులు అమ్ముకున్నామని ధర్మసాగర్ మండలం జానకిపురం సర్పంచ్ కుర్చపల్లి నవ్య దంపతులు అంటున్నారు. పసిపిల్లల పట్ల కూడా అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. చిన్న పిల్లల చుట్టూ సొల్లు కార్చుకుంటూ తిరుగుతున్నారు. సోషల్ డిస్టెన్స్ లేకుండా అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. మీకు, అక్కా చెల్లెళ్లు లేరా అని నిలదీసారు. నేను కేసీఆర్, కేటీఆర్ వరకూ వెళ్తాను సొంతపార్టీ నేతలపై మహిళా సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేసింది.

## గిరిజనుడి దారుణ హత్య

**ప్రజాతపన, ,భద్రాద్రి కొత్తగూడెం**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం లోని బియస్ రామయ్య నగర్ లో దారుణం జరిగింది. సప్కా రమేష్ అనే వ్యక్తిని అగంతకులు విచక్షణ రహితంగా కత్తులతో పొడిచి హత్య చేసారు. రాత్రి వేళ ఆరుబయట నిద్రిస్తున్న సమయంలో ఐదుగురు గుర్తు తెలియని వ్యక్తులు నల్లని దుస్తులు, ముసుగులు ధరించి. కరెంట్ వైర్లు కట్ చేసి చీకటిలో రమేష్ పై దాడి చేసినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. తరువాత అనంతరం అడవిలోకి పారిపోయినట్లు రమేష్ చిన్న భార్య లక్ష్మి చెబుతోంది. రమేష్ స్వగ్రామం బీజాపూర్ జిల్లా పెదగెల్లేరు. రమేష్ కు ఇద్దరు భార్యలు, పిల్లలు. కుటుంబ కలహాలు నేపథ్యంలో హత్య జరిగుంటుందా లేక మరేదైనా కారణమా అనే కోణంలో చర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అలరించిన అనూప్ జలోటా సంగీత కచేరి

**ప్రజాతపన సంగారెడ్డి**

భజన్ సామ్రాట్ అనూప్ జలోటా సంగీత కచేరితో అభిమానులను ఉర్రూతలూగించారు. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ శత జయంతి ఉత్సవ ముగింపు వేడుకల్లో అనూప్ జలోటా బృందం సంగీత కచేరీ నిర్వహించింది. రంగ్ దే చునరియా, అయిసి లాగి లగన్, రామునాము అప్నా భజన్ గీతాలకుతో సంగీత కచేరీలో కరతాళధనులు మార్మోగాయి. భజన్ సామ్రాట్ గా అంతర్జాతీయంగా పేరొందిన అనూప్ జలోటా భజన్ సంగీత్ తిలకించేందుకు ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర భజన్ సంగీత అభిమానులు భారీగా తరలివచ్చారు. దత్త గిరి మహారాజ్ శత జయంతి ఉత్సవాల ముగింపులో భజన్ తో అభిమానులను సంగీతంతో ముగ్ధుల్ని చేసిన అనూప్ జలోటా బృందానికి ఆశ్రమ పీఠాధిపతి అవధూత గిరి మహారాజ్, సిద్దేశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

## అన్న చేతబడి చేస్తున్నాడని అనుమానం

## అన్న పళ్లు పీకేసిన తమ్ముడు

**ప్రజాతపన కాకినాడ**

కాకినాడ జిల్లాలో దారుణం జరిగింది. చేతబడి నేపధ్యంలో సోదరుల మధ్య ఘర్షణ చెలరేగింది. కాకినాడ - నీలాద్రి రావు పేట గ్రామానికి చెందిన పసగుడుగుల చినబాబుపై, తమ్ముడు శ్రీనివాస్ దాడి చేసారు. తన కుమారునికి అనారోగ్యం కలగడంతో తన అన్న చేతబడి చేశాడని అనుమానంతో శ్రీనివాస్ వికలాంగుడైన అన్నపై దాడి చేసాడు. అన్నవి నాలుగు పళ్ళు పీకేశాడు.

# రఘురామరాజుపై ఎందుకు బ్యాక్ స్టెప్.. ?

**ప్రజాతపన ఏలూరు :**

వైసీపీ అధినేత జగన్ నరసాపురం పార్లమెంటు సభ్యుడు రఘురామ కృష్ణరాజు విషయంలో ఎందుకు చర్యలు తీసుకోలేకపోతున్నారు. ఆయనను పార్టీ నుంచి ఇప్పటికే బహిష్కరించాల్సి ఉంది. అలాగే స్పీకర్ కు ఆయనపై ఇచ్చిన అనర్హత వేటు విషయంలోనూ ఫాలో అప్ లేదు. ఎందుకిలా? అని పార్టీలో చర్చ జరుగుతుంది. నరసాపురం ఎంపీ రఘురామ కృష్ణరాజును మూడేళ్ల నుంచి పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్నప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై కిందిస్థాయి పార్టీ వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతుంది. ఆయనపై కనీస చర్యలు లేకపోవడంతో జగన్ ఎందుకు వెనకడుగు వేస్తున్నారన్న ప్రశ్న అందరిలోనూ మెదులుతోంది. ఆయన ఆ ప్రశ్నకు మాత్రం సరైన సమాధానం దొరకడం లేదు. ఇటీవల నెల్లూరు జిల్లాలో వైసీపీ ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిలపై పరోక్ష చర్యలైనా జగన్ తీసుకున్నారు. రఘురామ కృష్ణరాజుతో పోలిస్తే పార్టీపైనా, ప్రభుత్వం పైనా వారి విమర్శలు పెద్దగా ఘాటుగా లేకపోయినా వెంటనే హడావిడిగా ఇన్‌ఛార్జులను నియమించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి పార్లమెంటు



సభ్యుడు ఆదాల ప్రభాకర్ రెడ్డిని, వెంకటగిరి నియోజకవర్గానికి నేదురుమిల్లి రామ్‌కుమార్ రెడ్డిని నియమించారు. మరోవైపు పశ్చిమ గోదావరి జిల్లాలోనే పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడు తున్నారంటూ కొత్తపల్లి సుబ్బారాయుడిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు కూడా. జిల్లా కేంద్రాల ఏర్పాటుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ నిరసన తెలియజేసినందుకు కొత్తపల్లిని పార్టీ నుంచి వెంటనే సస్పెండ్ చేశారు. వారి కంటే ఎక్కువగా ప్రతి రోజూ రచ్చ బండ పేరుతో ప్రతి అంశంపై ప్రభుత్వంతో పాటు జగన్ ను, ఆయన కుటుంబ సభ్యులపై విమర్శలు చేస్తున్నారు. సర్వేలు చేయిస్తున్నారు. వైసీపీ ఓటమి ఖాయమని చెబుతున్నారు. కానీ జగన్ మాత్రం ఎలాంటి చర్యలకు పూనుకోవడంపై పార్టీ నేతల నుంచి కార్యకర్తల వరకూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. రఘురామ కృష్ణరాజు విమర్శలు ప్రారంభించిన తొలినాళ్లలోనే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తే సరిపోయేది కదా? అన్న ప్రశ్న తలెత్తింది. నరసాపురం పార్లమెంటుకు ఉప ఎన్నికలు జరిగితే వైసీపీకి ఇబ్బందులు వస్తాయని జగన్‌కు ఏదైనా సర్వే నివేదిక అందిందా? అన్న చర్చ కూడా జరగుతుంది. అయితే పార్టీ నుంచి బహిష్కరించినా, సస్పెండ్ చేసినా ఉప ఎన్నికలు రావు. రఘురామ కృష్ణరాజు స్వతంత్రంగా ఎంపీగానో, మరో పార్టీకి అనుబంధ సభ్యుడిగానో చేరవచ్చు. అప్పుడు విమర్శలు చేసినా వాటికి పెద్ద విలువ ఉండదు. ప్రజలతో పాటు కార్యకర్తలు కూడా విపక్ష పార్టీల విమర్శలుగానే చూస్తారు. కానీ జగన్ సస్పెండ్ చేయలేదు. బహిష?కరణ చేయలేదు. కేవలం స్పీకర్ పై అనర్హత వేటుకు సంబంధించి ఫిర్యాదు చేసి వదిలేశారు. దీంతో రఘురామ కృష్ణరాజు రోజూ రచ్చబండ ఏర్పాటు చేసి దుమ్ము దులుపుతున్నారు. ఇక ఎన్నికలకు ఏడాదికి మించి సమయం లేదు. ఆయనను ఇప్పటికైనా పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నందుకు చర్యలు తీసుకో వాలన్న అభిప్రాయం అయితే బలంగా వినపడుతుంది. కానీ జగన్ ఎందుకు భయపడుతున్నారన్నది ఎవరికీ అర్థం కాని ప్రశ్న.

# ఈ సమ్మర్ లో పవర్ కట్

**ప్రజాతపన హైదరాబాద్:**

ఎండాకాలం వచ్చేసింది. ఇప్పటి వరకూ మూలకు పడేసిన కూలర్‌లను బయటకు తీస్తున్నారు. అదీ చాలదంటే ఏసీలు కొంటున్నారు. ఫ్యాన్‌లు ఆగకుండా తిరుగుతున్నాయి. క్రమంగా విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. మార్చి మొదటి వారం నుంచే ఉష్ణోగ్రతలు తీవ్రంగా నమోదవుతూ వస్తున్నాయి. ఉక్కపోతకు తాళలేక ఎక్కువ సేపు ఏసీలు, కూలర్‌లు వినియోగిస్తున్నారు దేశ ప్రజలు. అయితే...ఈ వాడకం అంతా మార్చికే పరిమితమయ్యే అవకాశాలున్నాయి. ఏప్రిల్‌లో కరెంట్ కోతలు తప్పేలా లేవు. ముఖ్యంగా రాత్రి పూట పవర్ కట్‌లు తప్పవంటూ కొందరు అధికారులు చెబుతున్నారు. గతేడాది కన్నా ఈ ఏడాది విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశముందన్న అంచనాలు వస్తున్న నేపథ్యంలో ఆ స్థాయిలో విద్యుత్ సరఫరా చేయడం కష్టమేనన్న వాదన వినిపిస్తోంది. ఇందుకు ప్రధాన కారణం..బొగ్గు కొరత. కోల్ పవర్ ప్లాంట్‌లలో బొగ్గు నిల్వలు నిండుకుంటున్నాయి. ఫలితంగా విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కలుగుతోంది. సాధారణంగా ఎండాకాలంలో డిమాండ్ పెరుగుతుంది. అందుకు తగ్గట్టుగానే ఉత్పత్తి ఉంటుంది. కానీ..ఈ సారి మాత్రం డిమాండ్, సప్లై మధ్య అంతరాయం ఏర్పడుతుండొచ్చు. సోలార్



పవర్ ద్వారా మధ్యాహ్నం పూట విద్యుత్ డిమాండ్‌ను తీర్చగలిగినా రాత్రి పూట మాత్రం ఇబ్బందులు తప్పవు. రాత్రి పూట సోలార్ పవర్ అందుబాటులో ఉండదు కనుక ఈ సమస్య ఎదుర్కోవాల్సి వస్తుంది. గతంతో పోల్చుకుంటే 1.7% మేర తక్కువ విద్యుత్ అందుబాటులో ఉండనుంది. ఏప్రిల్‌లో రాత్రి పూట 217 ఉచి మేర విద్యుత్ డిమాండ్ ఉండే అవకాశముందని, గతేడాది ఏప్రిల్‌తో పోల్చి చూస్తే ఇది 6.4% అధికం అని అధికారులు వివరిస్తున్నారు. ఈ లెక్కన చూస్తే వచ్చే నెలలో రాత్రుళ్లు ఉక్కపోతతో అల్లాడాల్సి వస్తుంది. సాధారణంగా ఎండా కాలంలో రాత్రి పూట విద్యుత్ డిమాండ్‌ను తీర్చేందుకు కోల్, న్యూక్లియర్, గ్యాస్ ద్వారా 83% మేర పవర్ ఉత్పత్తి చేస్తారు. హైడ్రో పవర్ ప్లాంట్‌లు ఇందులో కీలక పాత్ర పోషిస్తాయి. అయితే..ఈ సారి మాత్రం హైడ్రో పవర్ ప్రొడక్షన్‌లో 18% మేర కోత పడుతుండొచ్చని అంచనా వేసింది. ప్రస్తుతం కొన్ని చోట్ల బొగ్గు ఆధారిత పవర్ ప్లాంట్‌ల నిర్మాణం జరుగుతోంది. ఈ నిర్మాణాల్లో జాప్యం కారణంగా కూడా విద్యుత్ డిమాండ్‌ను అందుకోవడం కష్టంగా ఉంది. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ ఆథారటీ ప్రకారం...26 బొగ్గు ఆధారిత పవర్ ప్లాంట్‌లు ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నాయి. ఒక్కో ప్లాంట్ కెపాసిటీ 16.8 గిగావాట్లు. కొన్ని పవర్ ప్లాంట్‌ల నిర్మాణం అయితే పదేళ్లుగా వాయిదా పడుతూ వస్తూనే ఉంది. ఈ కారణాలతో ఈ ఎండాకాలం దేశవ్యాప్తంగా ప్రజలు ఉక్కపోత భరించక తప్పదు. ఇప్పటికే వేడిని తట్టుకోలేక పోతుంటే.. .ఇప్పుడీ వార్త మరింత వేడిని పెంచుతోంది. ఏప్రిల్ నెలను తలుచుకుంటేనే భయపడేలా చేస్తోంది.

# నేటి తరానికి సావిత్రిబాయి పూలే ఆదర్శం

**ప్రజాతపన ,మంథని**

నేటి తరానికి సంఘ సేవకురాలు సావిత్రిబాయి పూలే ఆదర్శమని ప్రిన్సిపల్ వెంకట్రామిరెడ్డి కొనియాడారు. శుక్రవారం మంథని పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల ఆవరణలో ప్రిన్సిపల్ వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన సావిత్రిబాయి పూలే వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి పాఠశాల/కళాశాల సిబ్బంది నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ చదువు ప్రాధాన్యాన్ని వివరించిన గొప్ప సంఘసేవకురాలు సావిత్రిబాయి పూలే. మహిళల హక్కుల కోసం వందేళ్ల క్రితమే పోరాడిన తొలి తరం మహిళా ఉపాధ్యాయురాలు, రచయిత్రి. మహారాష్ట్ర సతారా జిల్లాలో నయాగావ్ అనే గ్రామంలో 1831 జనవరి 3 న ఒక రైతు కుటుంబంలో జన్మించారు. నిమ్న వర్గాల అభ్యున్నతికి



కృషి చేసిన మహాత్మా జ్యోతీరావ్ పులే సతీమణి సావిత్రిబాయి పూలే. ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్య పడుతుందని నమ్మిన ఆమె తన భర్తతో కలసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటి బాలికల పాఠశాలను ప్రారంభించారు. కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తమ సామాజిక బాధ్యతగా ఆ దంపతులు భావించారు. కేవలం నాలుగేళ్లలోనే గ్రామీణ ప్రాంతాల్లో 27 పాఠశాలలను ప్రారంభించి ఉచిత విద్యనందించారు. తన జీవిత కాలంలో మొత్తం 52 పాఠశాలలు ప్రారంభించారు. మానవ హక్కులు, ఇతర సామాజిక సమస్యల గురించి స్త్రీలను చైతన్య పరచడానికి 1852లో మహిళా సేవామండల్ అనే మహిళా సంఘాన్ని కూడా స్థాపించారు. జెండర్ సమస్యలకు తోడుగా, కుల పితృస్వామ్య వ్యవస్థల అణచివేతకు వ్యతిరేకంగా స్త్రీల సాధికారత కోసం ఈ సంస్థ కృషి చేశారు. 1873లో తన భర్త మహాత్మా పూలేతో కలసి సత్యశోధక్ సమాజ్‌ను ప్రారంభించి బాల్యవివాహాలకు, మూఢనమ్మకాలకు, సతీసహగమనానికి వ్యతిరేకంగా, వితంతు పునర్వివాహాలు కోసం బలమైన ఉద్యమం నడిపారు. తరువాత 1873 సెప్టెంబరు 24న “సత్యశోధక్ సమాజ్” అనే సామాజిక, ఆధ్యాత్మిక సంస్థను ప్రారంభించి, సత్యాన్ని శోధించడానికి ఉద్యమాన్ని నడిపారని సావిత్రిబాయి పూలేని కొనియాడారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నత స్థితిలో స్థిరపడాలని ఆశించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మహేష్, పాఠశాల/కళాశాల సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎలుగుబంటి దాడి

**ప్రజాతపన కొమరం భీం**



కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) మండలం టోంకిని, లోనవెల్లి గ్రామాల శివారు ప్రాంతంలో ఎలుగుబంటి అలజడి సృష్టించింది. కనబడ్డ వారిమీద దాడి చేసింది. ఎలుగుబంటి దాడిలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని ఆసుపత్రికి తరలించారు.

## సిపిఎస్ రద్దు చేయాలి- వామ పక్ష పార్టీలు

**ప్రజాతపన విశాఖపట్నం**

ఉద్యోగ, ఉపాధ్యాయులపై వైసిపి ప్రభుత్వ వేధింపులు ఆపాలని, సిపిఎ స్ రద్దు చేయాలని వామ పక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఓపిఎస్ అమలు చేయాలని, ఉద్యోగుల జీతాలు వెంటనే చెల్లించాలని కోరుతూ.. సిపిఎం, సిపిఐ విశాఖజిల్లా కమిటీల ఆధ్వర్యంలో విశాఖలోని జివిఎంసి గాంధీవిగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది . ఈ సందర్భంగా సిపిఎం, సీపీఐ నాయకులు మాట్లా డుతూ ముఖ్యమంత్రి జగన్ అధికారంలోకి వస్తే మాట తప్పను... మడమ తిప్పను అని చెప్పి ఇప్పుడు ఉద్యోగుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సీఎం మాట తప్పిన కారణంగా ఉద్యోగులు ఇబ్బందులు పడుతు న్నారని అన్నారు. ముఖ్యమంత్రి మాట మీద నిలబడే వ్యక్తి అయితే ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## వైసిపి ప్రభుత్వ హయాంలో

## ముస్లిం లకు చేసింది ఏమీ లేదు

**ప్రజాతపన విశాఖపట్నం**

వైసిపి ప్రభుత్వ హయాంలో ముస్లిం లకు చేసింది ఏమీ లేదనీ మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి లీగల్ టీం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సలీం అన్నారు. గత ప్రభుత్వ హయాంలోనే మైనారిటీలకు పథకాలు అమలు జరిగాయనీ ఆరోపించారు. విశాఖలోని ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. వైజాగ్ రాజధాని అని చెప్పి, విశాఖలో ఉన్నటువంటి 3వేల ఎకరాల వక్ఫ్ బోర్డ్ భూములను కొట్టేయాలని చూస్తున్నారా అని ప్రశ్నించారు. మైనారిటి హక్కుల పరిరక్షణ సమితిగా మైనారిటీ హక్కుల పై పోరాడుతామని స్పష్టం చేశారు. ముస్లిం లకు ప్రభుత్వం చేసిన దాని పై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## యువకుడి దారుణ హత్య

**కుత్బుల్లాపూర్**

దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ గృహకల్పలో నివసించే వినయ్(26) హత్య స్థానికంగా కలకలం రేపింది.. ఈ నెల 7వ తేదిన హోళి పండగని జరుపుకుని ఒంటిపై పూర్తి గాయాలతో ఇంటికి వచ్చిన వినయ్ (26)ని తన నలుగురు స్నేహితులు వచ్చి బలవంతంగా లాక్కెల్లి జ్యోతి మిల్క్ పక్కన ఉన్న అటవీ ప్రాంతంలో హత్య చేసి పడేశారని ఆరోపించారు మృతుడి తల్లి..మృతుడు స్థానికంగా ఉన్న ఫ్యాన్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తు తన స్నేహితులతో గంజాయి సేవిస్తూ ఉంటాడని,గతంలో బాలనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యాచారం కేసులో నిందితుడని తెలిపారు పోలీసులు మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు బాడీని గాంధీ హస్పిటల్ కి తరలించారు..హత్య విషయంలో కేసును ముమ్మరంగా పరిశీలిస్తున్నట్లు త్వరలోనే నిందితులను పట్టుకుంటామన్నారు ఎసిపి వెంకట్ రెడ్డి

## కొనసాగుతున్న రైల్వే డబల్ లైన్ పనులు

**ప్రజాతపన బేతంచర్ల,**

గుంటూరు నుంచి గుంతకల్లు వరకు జరుగుతున్న రైల్వే డబల్ లైన్ పనులను బేతంచర్ల వద్దకు చేరుకున్నాయి. బేతంచర్ల దగ్గర విస్తృతంగా రైల్వే పనులను చేస్తున్నామని ప్రయాణికుల సౌకర్యార్థము శరవేగంగా పూర్తి చేస్తున్నామని రైల్వే అధికారులు తెలియజేశారు.

## బైక్ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలు

**ప్రజాతపన బేతంచర్ల,**

బేతంచెర్ల మండల పరిధిలోని బుగానపల్లె గ్రామానికి చెందిన కొమ్ము తిరుమలేష్, గుమ్మ సుబ్బరాయుడులు బేతంచర్ల మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామంలో తమ బంధువుల శు భకార్యానికి వెళ్లి తమ గ్రామానికి తిరిగి వస్తుండగా శివాలయం వద్ద బైక్ అదుపు తప్పి కింద పడటంతో కొమ్ము తిరుమలేష్ కు తలకు గాయమై చెయ్యి విరిగిందని గుమ్మ సుబ్బరాయుడు కు స్వల్ప గాయాలయాయని వారిని బేతంచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# కాళేశ్వరానికి కాగ్....



**ప్రజాతపన కరీంనగర్:**

కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణంలో భారీగా అక్రమాలు జరిగాయనే విపక్షాల ఆరోపణల నేపథ్యంలో ప్రాజెక్టు పనుల్ని ప్రత్యక్షంగా తనిఖీ చేసేందుకు కంప్ట్రోలర్ అండ్ ఆడిట్ జనరల్ కార్యాలయం సిద్ధమైంది. ప్రాజెక్టు నిర్మాణంపై అధ్యయనానికి సిద్ధమైంది .తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కేసీఆర్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోత ప్రాజెక్టు నిర్మాణంపై కాగ్ దృష్టి సారించింది. ప్రాజెక్టు నిర్మాణంలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని ఇప్పటికే విపక్షాలు పలుమార్లు ఆరోపించాయి. కాంగ్రెస్‌తో పాటు వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు ఢిల్లీ వెళ్లి మరీ ప్రాజెక్టు నిర్మాణంపై ఫిర్యాదులు చేశారు.ప్రాజెక్టు నిర్మాణంపై గత ఏడాదిన్నరగా తెలంగాణ ప్రభుత్వాన్ని కాగ్ పలు రకాల సమాచారం అడగటం, నివేదికల ఆధారంగా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించడం, కాగ్ బృందాలకు వచ్చే సందేహాలకు తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు వివరణ ఇవ్వడం, వాటిపై కొర్రీలు వేయడం జరుగుతోంది.ఇటీవల కాగ్ ఉన్నతాధికారి నేరుగా కాళేశ్వరం పనులను పరిశీలించాలని నిర్ణయించారు. హైదరాబాద్‌లోని అకౌంటెంట్ జనరల్ కార్యాలయంలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్‌గా పనిచేస్తున్న నిఖిల్ చక్రవర్తి 11వ తేదీన అన్నారం పంపుహౌస్, సుందిళ్ల బ్యారేజీలను పరిశీలించనున్నారు. ఈ మేరకు సంబంధిత చీఫ్ ఇంజినీర్‌కు, సూపరింటెండింగ్ ఇంజినీర్‌లకు లేఖ రాశారు.కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో పలు అంశాలపై తెలంగాణ నీటిపారుదల శాఖ ఇచ్చిన వివరాలపై ఇప్పటికే వివరణల మీద వివరణలు కోరుతోంది. వాటిపై పలు దఫాలు సమీక్షలు కూడా జరిగాయి. క్షేత్రస్థాయి పర్యటనలు జరిగిన తర్వాత ఇప్పుడు మూడోసారి పరిశీలనకు ఉన్నతస్థాయి అధికారి నేరుగా వస్తుండటం నీటిపారుదల శాఖ వర్గాల్లో చర్చగా మారింది.కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన సమాచారాన్ని కోరుతూ గతంలో కంప్ట్రోలర్ అండ్ ఆడిట్ జనరల్ అధికారులు రెండు వేర్వేరు లేఖలు రాశారు. డిజైన్ల నుంచి పనుల వరకు అన్ని రకాల సమాచారాన్ని కోరారు. ప్రాజెక్టు డిజైన్లలో మార్పులు చేసి ఉంటే ఆ వివరాలు కూడా ఇవ్వాలని కోరారు. టెండర్ల పరిశీలన డాక్యుమెంట్లు, డిజైన్లు, డ్రాయింగులు, పెరిగిన ధరల వివరాలను ఇరిగేషన్ అధికారుల్ని కోరారు. వీటిలో చాలా వరకు వివరాలను అధికారులు కాగ్ కార్యాలయానికి పంపారు .మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించి టెండర్ డాక్యుమెంట్లతోపాటు ఎన్ఐటీ, ఇంజినీరింగ్ రీసెర్చి ల్యాబొరేటరీ చేసిన అధ్యయనాలు, నిర్మాణ సమయంలో వినియోగించిన డీజిల్, లేబర్ ఛార్జీలు, ఇతర మెటీరియల్ కొనుగోలు, గేట్లకు సంబంధించిన ధరల వివరాలు, జీఎస్టీ చెల్లింపులు, ఎం.బుక్ లో వివరాల నమోదు, మొదట నిర్ణయించిన దానికి భిన్నంగా జరిగిన మార్పులు తదితర అంశాలపై వివరాలను కోరినట్లు తెలుస్తోంది. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, మూడు లిఫ్టులకు సంబంధించి కూడా ఇదే సమాచారాన్ని కోరారు.తెలంగాణలో జరిగిన సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో అక్రమాలు జరిగాయని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్న నేపథ్యంలో కాగ్ పరిశీలన కాక రేపుతోంది. ఇందులో ఏవైనా అక్రమాలు వెలుగు చూస్తే చిక్కులు తప్పకపోవచ్చని భావిస్తున్నారు.

# చల్లాకు సీటుతో ఏపీలో ఎంట్రీ..?

**ప్రజాతపన ,మహబూబ్ నగర్ :**

కేసీఆర్..... వ్యూహాలు రచించటంలో దిట్ట..! ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ... ప్రత్యర్థి పార్టీలను ఈజీగా బోల్తా కొట్టించేస్తారు..! సూటిగానే పదునైన మాటలతో... టార్గెట్ చేసి ఏకిపారేస్తారు.. ! కాస్త సైలెన్స్ గా ఉన్నారంటే... ఏదో మాస్టర్ స్కెచ్ తో ముందుకువస్తారన్నట్లు ఉంటుంది ఆయన తీరు..! ఆయన తీసుకొనే కొన్ని నిర్ణయాలు కూడా ఎవరికీ అర్థం కాకుండా ఉంటాయి..! తాజాగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక విషయం కూడా చర్చనీయాంశంగా మారింది. ఇందులోనూ కేసీఆర్ తనదైన స్టైల్ లో కసరత్తు చేశాకే... ఓ నిర్ణయానికి వచ్చారని తెలుస్తోంది. అయితే మొత్తం ముగ్గురిని ఖరారు చేయగా... ఇందులోని ఓ అభ్యర్థి విషయంలో మాత్రం... పక్కాగా రాజకీయ సమీకరణాలను దృష్టిలో ఉంచుకొనే ఫైనల్ చేశారన్న చర్చ జోరుగా నడుస్తోంది.టీఆర్ఎస్ ను కాస్త బీఆర్ఎస్ గా మార్చిన కేసీఆర్... పార్టీని పక్క రాష్ట్రాల్లో కూడా విస్తరించే పనిలో పడిన సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఎమ్మెల్సీ ఎంపిక విషయం కూడా ఈ కోణంలోనే ఉందన్న టాక్ గట్టిగా వినిపిస్తోంది. ఇప్పటికే ఏపీలో పార్టీని లైన్ లోకి తీసుకొచ్చిన కేసీఆర్... బలమైన సామాజికవర్గం ఉన్న తోట చంద్రశేఖర్ ను అధ్యక్షుడిగా నియమించి అందరికీ షాక్ ఇచ్చారు. అయితే తాజాగా... ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన చల్లా వెంకట్రామిరెడ్డికి కేసీఆర్ ఎమ్మెల్సీ సీటును ఖరారు చేశారు. నిజానికి గత డిసెంబర్ మాసంలోనే చల్లా గులాబీ గూటికి చేరారు. ఇంతలోనే ఆయన ఎమ్మెల్సీ పదవి ఇవ్వటం వెనక కేసీఆర్ మరో మాస్టర్ స్కెచ్ వేశారని తెలుస్తోంది.చల్లా వెంకట్రామిరెడ్డి... గద్వాల జిల్లాకు చెందిన నేత..!సీమ జిల్లాలతో సరిహద్దు పంచుకునే ఈ నియోజకవర్గానికి చెందిన చల్లాకు ఎమ్మెల్సీ ఇవ్వటంతో ద్వారా.. పార్టీని విస్తరించాలని కేసీఆర్ భావిస్తున్నారట! దీనికి కారణం లేకపోలేదు చల్లా వెంకట్రామిరెడ్డి తెలంగాణకు చెందిన నేత అయినప్పటికీ సీమలో ఆయనకు మంచి బంధుత్వాలు ఉన్నాయి. మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డికి ఆయన మనవడు అవుతారు. అనంతపురం జిల్లాకు చెందిన నీలంసంజీవరెడ్డికి కర్నూలు , కడపతో పాటు మహబూబ్ నగర్ జిల్లాల్లో బంధుత్వాలు ఉన్నాయి. మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి కుటుంబంతో కూడా దగ్గరి బంధుత్వం ఉంది. చల్లా వెంకట్రామిరెడ్డి ఎంపికతో సీమ జిల్లాల్లో పార్టీ విస్తరణకు అవకాశాలు ఉంటాయని కేసీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. సీమ జిల్లాల్లోని రెడ్డి సామాజికవర్గానికి కూడా దగ్గర కావొచ్చని కేసీఆర్ చూస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇక కర్నూలు జిల్లాలో చల్లాకు వ్యాపారాలు ఎక్కువగా ఉన్నాయి. పలు అధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలకు కూడా విరాళాలు ఇస్తూ మంచి పేరును సంపాందించారు.ఇక చల్లాకు ఎమ్మెల్సీ ఇవ్వటంతో కేవలం సీమలో పార్టీ విస్తరణే కాదు... మరో కోణంలో కూడా ఎంపిక చేశారన్న చర్చ నడుస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కూడా గద్వాల జిల్లా పరిధిలోని గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ జెండాను ఎగరవేయాలని కేసీఆర్ చూస్తున్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లో కూడా చల్లాకు ఫాలోయింగ్ ఉంది. గతంలో ఆయన అలంపూర్ నుంచి ఎమ్మెల్యేగా కూడా పని చేశారు. అయితే ఆయనకు ఉన్న ఇమేజ్ ను పార్టీకి వాడుకోవటంతో ఈ సీట్లను కూడా ఈజీగా మరోసారి కొట్టాలని కేసీఆర్ చూస్తున్నారట..! అంటే ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లు కేసీఆర్ నిర్ణయం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి?!

# వైయస్సార్ సి పి అభ్యర్థులను గెలిపించండి

**వారికి భారీ మెజార్టీ ఇవ్వండి**

**వైకాపా ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి బద్వేల్**

**ఎమ్మెల్యే డాక్టర్ సుధా**



**ప్రజాతపన ,బద్వేలు**

ఈనెల 13వ తేదీ జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైయస్సార్ సిపి అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా ఓటర్లకు విజ్ఞప్తి చేశారు శుక్రవారం వారు బద్వేల్ లో మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి పట్టపద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవి రామచంద్రారెడ్డి భారీ మెజార్టీ ఇవ్వాలని వారు కోరారు జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న విషయాన్ని వారు గుర్తు చేశారు ఉద్యోగ ఉపాధ్యాయులు అందరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని వారు కోరారు వైయస్సార్ సి పి అభ్యర్థులను గెలిపించుకుంటే భవిష్యత్తులో వారు ఎంతో ఉపయోగపడతారని వారు అన్నారు వైయస్సార్ సిపి పట్టపద్రుల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఈ సందర్భంగా వారు కోరారు పార్టీ విజయానికి పార్టీ ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు శక్తివంచన లేకుండా పనిచేయాలని ఈ సందర్భంగా వారు కోరారు 100% ఓటర్లు ఓటింగ్లో పాల్గొనేలా పార్టీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు పోలైన ఓట్లలో 85%వైయస్సార్ సిపి అభ్యర్థులకు ఓట్లు పడేలా నాయకులు పనిచేయాలని వారు కోరారు విజయానికి శక్తి మేరకు నాయకులు కార్యకర్తలు పనిచేస్తే అనుకున్న ఫలితం ఉంటుందని వారు అన్నారు ఈనెల 13 తేదీ ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎన్నికల పోలింగ్ జరుగుతుందన్నారు వైఎస్ఆర్సిపి తరపున పోటీ చేస్తున్న ఇద్దరు ఎమ్మెల్సీ అభ్యర్థులు మేధావులనివారు పేర్కొన్నారు రాయలసీమ పట్టపద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి హైకోర్టు న్యాయవాదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంబి రామచంద్రారెడ్డి కడప సాయిబాబా విద్యాసంస్థల కరస్పాండెంట్ అని వారు తెలిపారు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బలపరిచిన ఇరువురు అభ్యర్థులను గెలిపించవలసిన బాధ్యత మన అందరి మీద ఉందని వారు పేర్కొన్నారు సమావేశంలో బద్వేలు మున్సిపల్ చైర్మన్ వి రాజగోపాల్ రెడ్డి వైస్ చైర్మన్ రాచపూడి వెంకట సాయి కృష్ణ పార్టీ నాయకులు కుప్పాల శ్రీరాములు సింగ సాని శివయ్య గోపవరం మండలంవైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

# ఆగని కుక్కల దాడులు

**ప్రజాతపన , హైదరాబాద్:**

నిన్నగాక మొన్న ప్రదీప్‌ని పొట్టనపెట్టుకున్న కుక్కలు? గత కొద్దిరోజులుగా నగరంలో భీభత్సం సృష్టిస్తున్నాయి. ఈ ఒక్క రోజే రెండు చోట్ల కుక్కలు జనంపై ఎటాక్ చేశాయి. కుక్కల వరుస దాడులకు పసిపిల్లలు బలైపోతున్న దుర్ఘటనలు తల్లిదండ్రుల్లో భయాందోళనలు సృష్టిస్తోంది. కుక్కల దాడులతో పసిబిడ్డలు బెంబేలెత్తిపోతున్నారు. తాజాగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో మరోసారి వీధి కుక్కలు బీభత్సం సృష్టించాయి. అత్తాపూర్ డివిజన్ తేజస్వి నగర్ కాలనీలో సన్‌రైజ్ టవర్స్ దగ్గర ఓ మూడేళ్ళ చిన్నారిని వదిలి?పిల్లాడి తల్లీతండ్రీ కూలి పనిలోకి వెళ్ళారు. రెండేళ్ల బాబు అక్కడే ఆడుకుంటుండగా దాదాపు పదిపన్నెండు వీధి కుక్కలు పిల్లాడిపై హఠాత్తుగా ఎటాక్ చేశాయి. దీంతో హడలిపోయిన మూడేళ్ళ పసివాడు ఏడుపులంకించుకున్నాడు. కుక్కలు బాలుడిని తరుముకుంటూ వెంబడించాయి. పిల్లవాడి ఏడుపు విన్న స్థానికులు పరిగెత్తుకు రావడంతో ప్రాణాపాయం తప్పింది. కుక్కలను తరిమేసి, బాలుడిని కాపాడారు స్థానికులు?మరోవైపు మేడ్చల్ జిల్లా? పీర్జాది గూడ, బుద్దా నగర్ లో రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి భూపాల్ రెడ్డిపై కుక్కలు ఎటాక్ చేశాయి. ఉదయం వాకింగ్ కి వెళ్లి వస్తుండగా వీధి కుక్కలు దాడిచేయడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి.గతంలో కూడా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లో చిన్నారులపై కుక్కలు దాడి చేశాయి. అయితే మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఘటన జరిగినప్పుడు హడావుడి చేసి ఆ తరువాత మర్చిపోతున్నారని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# కస్తూర్బాలో ఫుడ్ పాయిజన్

**ప్రజాతపన మహబూబ్ నగర్:**

మహబూబాబాద్ జిల్లా కస్తూర్భ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అయింది. విషాహారం తిన్న విద్యార్థుల్లో 16 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిందర్నీ మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా కస్తూర్భ పాఠశాలలో గత రాత్రి భోజనం చేసినప్పటి నుంచి విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. అస్వస్థతతు గురయ్యారు. అయినా నిర్వాహకులు పట్టించుకోలేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఆరోగ్యం బాగాలేదని చెప్పినా రియాక్ట్ కాలేదని అంటున్నారు. చివరకు పరిస్థితి చేయిదాటిపోతుందన్న టైంలో ఫుడ్ పాయిజన్ అయిన విద్యార్థులకు అక్కడే వైద్య చికిత్సలు అందించారని చెలుస్తోంది. విషయం బయటకు పొక్కకుండా డాక్టర్లను కస్తూర్భా పాఠశాలలోకి పిలిపించుకొని సీక్రెట్‌గా వైద్యం అందించారని తెలుస్తోంది. దీనిపై వివిధ మీడియాల్లో కథనాలు రావడంతో అలర్ట్ అయిన నిర్వాహకులు అప్పుడు ఆసుపత్రికి తరలించినట్టు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. రెండు కార్లలో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కొంతమంది విద్యార్థినీలు కడుపు నొప్పి భరించలేక అవస్థలు పడుతున్నారు. కొందరికి సాధారణ చికిత్స అందిస్తున్నారు. మరి కొంతమంది విద్యార్థినీలకు వెంటిలేటర్ మీద శ్వాస అందిస్తున్న పరిస్థితి ఉంది. ఇంత జరిగినా ఇంతవరకు విద్యార్థినీల తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వలేదన్న విమర్శలు ఉన్నాయి. విద్యార్థులకు ప్రమాదం లేదని అసలు ఎందుకిలా జరిగిందో తెలుసుకుంటున్నామని చెబుతున్నారు వైద్యులు. కలుషిత నీరు కారణంగా ఇలా జరిగిందా.. లేకుంటే ఆహారం వల్లే ఇది జరిగిందా అనేది పిల్లలు కోలుకున్న తర్వాతే తెలుస్తుందని అంటున్నారు. ఈ ఘటనపై విద్యార్థి సంఘాలు భగ్గుమంటున్నాయి. నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. ఇంత జరిగినా తల్లిదండ్రులకు ఉన్నతాధికారులు సమాచారం ఇవ్వకపోవడంపై వారంతా మండిపడుతున్నారు.చికిత్స పొందుతున్న విద్యార్థులను ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మహబూబాబాద్ మున్సిపల్ కమిషనర్ పరామర్శించారు. భయపడాల్సిన పని లేదని వైద్యులు చికిత్స అందిస్తున్నారని త్వరగా కోలుకుంటారని భరోసా ఇచ్చారు.

# లిక్కర్ స్కాం నిందితుడు పిళ్లై యూ టర్న్

**ప్రజాతపన ,న్యూఢిల్లీ:**



ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో అనూహ్య మలుపు చోటు చేసుకుంది. అరుణ్ రామచంద్రన్ పిళ్లై సౌత్ లాబీలో తెలంగాణ ఎమ్మెల్సీ తరపున వ్యాపారం చేస్తున్నానంటూ ఆమె ప్రతినిధినని ఈడీకి ఇచ్చిన వాంగ్మూలాన్ని తాను వెనక్కి తీసుకుంటానని ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ ను పరిగణనలోకి తీసుకున్న రౌస్ అవెన్యూ కోర్టు ఈడీకి నోటీసులు జారీ చేసింది. రామచంద్ర పిళ్లై ఇచ్చిన ట్విస్ట్‌తో ఇప్పుడు ఈడీ ఏం చేయబోతోందన్నది ఆసక్తికరంగా మారింది. హైదరాబాద్‌కు చెందిన వ్యాపార వేత్త అయిన అరుణ్ రామచంద్ర పిళ్లై తాను కేసీఆర్ కుమార్తె, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బినామీనని ఇంతకు ముందు ఈడీ అధికారులకు వాంగ్మూలం ఇచ్చారు. ఆ వాంగ్మూలం ఆధారంగా రిమాండ్ రిపోర్టును ఈడీ అధికారులు కోర్టుకు సమర్పించారు. ని సీబీఐ స్పెషల్ కోర్టుకు నివేదించిన రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు ఉన్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీ నేతలకు రూ.100 కోట్ల మేర ముడుపులు ఇచ్చిన సౌత్ గ్రూప్ గుప్పిట్లో ఉన్న ఇండోస్పిరిట్స్ సంస్థలో ఎమ్మెల్సీ కవిత తరఫున అరుణ్ పార్టనర్‌గా ఉన్నారని ఈడీ ఆరోపించింది. ఈ కుంభకోణం మొత్తంలో అక్రమంగా సంపాదించిన సొత్తు దాదాపు రూ.296 కోట్లు ఉండవచ్చని ఈడీ అంచనా వేసింది. దీంట్లో కొంత సొమ్ముతో అరుణ్ రామచంద్ర పిళ్లై కొన్ని ఆస్తులు కొన్నారని తెలిపింది. ఢిల్లీ లిక్కర్ కేసులో అరుణ్ రామచంద్ర పిళ్లై కీలక వ్యక్తిగా పేర్కొన్నారు. సౌత్ గ్రూప్‌లో పార్టనర్స్‌గా శరత్ చంద్రారెడ్డి, మాగుంట రాఘవ్, శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్సీ కవిత సహా మరికొంత మంది ఉన్నారు. దీనికి బయట ప్రతినిధులుగా పిళ్లై, అభిషేక్ బోయినపల్లి, బుచ్చిబాబు వ్యవహరిస్తున్నారని రిమాండ్ రిపోర్టులో తెలిపారు.అరుణ్ రామచంద్ర పిళ్లైను సీబీఐ, ఈడీ అధికారులు చాలా కాలంగా విచారిస్తున్నారు. దాదాపు?గ 29 రోజుల పాటు ఆయనను ప్రశ్నించినట్లుగా తెలుస్తోంది. ఆ సమయంలోనే పిళ్లై వాంగ్మూలం ఇచ్చినట్లుగా భావిస్తున్నారు. అయితే ఇప్పుడు తన వాంగ్మూలాన్ని వెనక్కి తీసుకోవాలనుకోవడానికి కారణం ఏమిటన్నది ఆశ్చర్యకరంగామారింది. ఒక్ వేళ ఆ వాంగ్మూలం నిజం కాకపోతే.. ఏ ఉద్దేశంతో కవిత పేరును తెరపైకి తెచ్చారన్నది తేలాల్సి ఉంటుంది. ఆయన తాను కవిత తరపునే వ్యాపారం చేస్తున్నానని చెప్పుకోవడానికి దారి తీసిన పరిస్థితులేమిటో వెల్లడి కావాల్సి ఉంటుంది. ఈ అంశం ఇప్పటికే రాజకీయ దుమారం రేపుతోంది. తమను కేంద్ర ప్రభుత్వం టార్గెట్ చేస్తోందని కవిత, కేటీఆర్ కూడా ఆరోపించారు. వాంగ్మూలం వెనక్కి తీసుకుంటానన్న రామచంద్ర పిళ్లై పిటిషన్‌పై ఇప్పుడు ఈడీ ఏం చేయబోతోందనేది ఆసక్తికరంగా మారింది. పిళ్లై వాంగ్మూలం ఆధారంగానే ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసులు జారీ చేసింది. 9వ తేదీనే ఆమె హాజరు కావాల్సి ఉన్నప్పటికీ ప్రత్యేకంగా గడువు కోరి 11వ తేదీకి మార్చుకున్నారు. ఈ లోపే వాంగ్మూలం ఉపసంహరణ పిటిషన్ పిళ్లై దాఖలు చేయడంతో కేసులో కీలక మలుపులు చోటు చేసుకుంటున్నట్లుగా భావిస్తున్నారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

## 40 లక్షల హవాలా డబ్బును పట్టుకున్న సుల్తాన్ బజార్ పోలీసులు

**ప్రజాతపన , హైదరాబాద్:**

సుల్తాన్ బజార్ పోలీసులు శుక్రవారం నాడు భారీగా హవాలా నగదును స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్ లోని ఏహెచ్ఎస్ ఆటో స్టూడియో షాపులో క్యాషియర్గా పనిచేస్తున్న నంద కిషోర్ జాజూ నగదు వసూల్ కోసం ట్రూప్ బజార్ కు వచ్చాడు. ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో గురువారం రాత్రి రాత్రి పోలీసులు తనిఖీలు చేస్తుండగా నందకిషోర్ అనుమానాస్పందంగా కనిపించాడు. దాంతో సోదాలు చేయగా హవాలా గుట్టు రట్టయింది. 40 లక్షల నగదును స్వాధీనం చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం నిందితుడిని నాంపల్లి కోర్టులో హాజరుపరచారు.

## అవినీతి ఎక్కడుంటే అక్కడ సిబిఐ వుంటుంది

**ప్రజాతపన , సంగారెడ్డి**

అవినీతి, అక్రమాలు ఎక్కడుంటే సీబీఐ, ఈడీ అక్కడే ఉంటుందని బిజెపి నేత వివేక్ వెంకటస్వామి అన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లో ఓ వివాహ వేడుకల్లో పాల్గొన్న వివేక్ సీఎం కేసీఆర్, కేటీఆర్ పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో కల్వకుంట్ల రాక్షస పాలన నడుస్తోందని తరిమికొట్టేందుకు బిజెపి శ్రేణులు సిద్ధం అవుతున్నారని వివేక్ పేర్కొన్నారు. కేసీఆర్ కుటుంబం తెలంగాణను ఇష్టారాజ్యంగా దోచుకుందని ఆరోపణలు గుర్తించారు. నిన్న కేటీఆర్ సంస్కారం లేకుండా వాడు, వీడని మాట్లాడడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసీఆర్, కేటీఆర్, కవిత అక్రమంగా దోచుకున్న ఆస్తులపై సిబిఐ, ఈడి దర్యాప్తులు చేపడితే అసలు నిజాలు బయటపడతాయని అన్నారు. మద్యం కుంభకోణంలో కవితకు సంబంధం లేకుంటే ఎందుకు వణికిపోతున్నారని వివేక్ ఏద్దేవా చేశారు.

## తక్కువ ధరకే బంగారమని ఆశ పడితే?.

**ప్రజాతపన , రంగారెడ్డి**

అసలు బంగారం అంటూ నకిలీ బంగారం తో ఆశ చూపించి లక్ష రూపాయల తో ఒక వ్యక్తి ఉడాయించిన ఘటన ఇది. రంగారెడ్డి జిల్లా మీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో బడంగ్ పేటలోని జయశంకర్ నగర్ లో నివసించే శీనుకు గణేష్ అనే వ్యక్తి తన వద్ద స్వచ్ఛమైన బంగారం ఉందని ఆశ చూపించాడు. తన వద్దనున్న బంగారం కడ్డీల నుంచి ఒక మూక్క కట్ చేసి ఇచ్చి దానిని ఎక్కడైనా పరీక్ష చేయించుకోమన్నాడు. తక్కువ ధరకు బంగారం వస్తుంది ఆశ తో ఒక ముక్క ను ఓ బంగారం షాప్ లో పరీక్ష చేయించగా అతని ఇచ్చినది నిజం అయిన బంగారమని తేలింది. గణేష్ నాకు చాలా అవసరం ఉందని ఒక లక్ష రూపాయలు ఇవ్వమని అడిగాడు. డబ్బుకు బదులుగా నా వద్ద ఉన్న బంగారం మీ దగ్గర పెట్టుకోమని చెప్పాడు. నిజం అయిన బంగారం కడ్డీ అని నమ్మి లక్ష రూపాయలు బాధితుడు ఇచ్చాడు. తరువాత ఆ బంగారం పై అనుమానం వచ్చి శ్రీను మరల ఆ షాప్ వద్దకు వెళ్లి చూపించగా నకిలీ అని తెలియడంతో లబో దిబో అంటూ తను మోసపోయానని బావురమన్నాడు. సదరు వ్యక్తి కనపడక పోవడంతో అనుమానం వచ్చి గణేష్ అనే వ్యక్తి పై బాధితుడు మీర్పేట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.

## అన్యాయం జరుగుతుందని ఎందుకు స్పందించడం లేదు -మాజీ మంత్రి అయ్యన్న

**ప్రజాతపన , విశాఖపట్నం**

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 37 మంది పోటీ చేస్తున్నారని,వీరిలో విద్యావంతులు అదిక శాతం ఉన్నారని,ఓటేసే ముందు విజ్ఞతతో ఆలోచించి తగిన నిర్ణయం తీసుకోవాలని మాజీమంత్రి అయ్యన్న పాత్రుడు పట్టభద్రులను కోరారు.వైసీపీ అభ్యర్థి సుధాకర్ కు ఎందుకు ఓటేయా లని అంటున్నారని,పోలవరం ప్రాజెక్టు కోసం సిఎం జగన్,వైసీపీ నేతలు ఆలోచించారా అని ప్రశ్నించారు.కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ని అమ్మేస్తుంటే అడ్డుకున్నారా అని ప్రశ్నించారు.గంగ వరం పోర్ట్ ప్రభుత్వ వాటా అధానికి ఎందుకు అమ్మేశారని,అయినా ఈ ప్రాంత వైసీపీ పెద్దలు ఎందుకు మౌనం గా వున్నారని నిలదీశారు.మెట్రో రైల్ ప్రాజెక్టు సాధించడంలో సీఎం ఫెయిల య్యారని,విశాఖలో ప్రభుత్వ ఆస్తుల ను 25 వేల కోట్లకు తాకట్టు పెట్టేసా రని,ఉత్తరాంధ్రలో వేలాది ఎకరాలు కబ్జా చేసేసారని ఆరోపించారు.

## టీచర్ ఎమ్మెల్సీకి 22 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు

**హైదరాబాద్**

మహబూబ్ నగర్ - రంగారెడ్డి - హైదరాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి ఈ నెల 13న జరుగనున్న ఎన్నికలకు మొత్తం 137 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం జరిగింది. అందులో 126 మెయిన్ పోలింగ్ స్టేషన్లు ఉండగా 11 అదనపు పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. మొత్తం 29,720 ఓటర్లు ఉండగా అందులో పురుషులు 15,472, స్త్రీలు 14,246, ఇతరులు 2 ఓట్లు కలవు. ఏర్పాటు చేసిన 137 పోలింగ్ స్టేషన్లలో మహబూబ్ నగర్ జిల్లాలో 15 పోలింగ్ స్టేషన్లు, నాగర్ కర్నూల్ 14, వనపర్తి 7, జోగులాంబ గద్వాల్ 11, నారాయణ పేట్ 5, రంగారెడ్డి జిల్లాలో 31, వికారాబాద్ 18, మేడ్చల్ మల్కాజ్ గిరి 14, హైదరాబాద్ జిల్లాలో 22 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు.

# క్లాస్ మేట్ పై ఫ్రెండ్స్ అత్యాచారం

**ప్రజాతపన , హైదరాబాద్:**

హైదరాబాద్ శివారులో ఓ మైనర్ బాలికపై అఘాయిత్యం జరిగింది. పదో తరగతి చదువుతున్న బాలికపై తోటి విద్యార్థులే సామూహికంగా అత్యాచారం చేశారు. ఆ సమయంలో సెల్ ఫోన్లో వీడియోలు, ఫోటోలు తీసి బ్లాక్ మెయిల్ చేసి మళ్లీ మళ్లీ అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఈ ఘటన ఆరు నెలల క్రితం జరగ్గా తాజాగా వెలుగులోకి వచ్చింది. తాజాగా అత్యాచారం చేసిన ఐదుగురు మైనర్ బాలురను పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ శివారులోని హయత్ నగర్లో ఈ ఘటన జరిగింది.హయత్ నగర్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. హయత్ నగర్ సమీపంలోని తట్టి అన్నారం ప్రాంతంలో ఓ పాఠశాలలో బాధితురాలితో పాటు నిందితులు కూడా పదో తరగతి చదువుతున్నారు. ఈ బాలురు నీలిచిత్రాలు చూడడం మొదలుపెట్టి వాటికి బానిసలు అయ్యారు. అలా 17 ఏళ్ల తోటి విద్యార్థినిపై కన్నేశారు. ఒకటే క్లాసు కావడంతో అందరూ ఫ్రెండ్లీగా ఉండడంతో వారు లైంగిక దాడికి ప్రణాళిక వేశారు. ఆమె కదలికలను గమనించేవారు. ఓసారి బాధితురాలి ఇంట్లో ఆమె తల్లిదండ్రులు లేకపోవడం, ఆమె ఒంటరిగా ఉండటం గమనించి ఐదుగురు బాలురు ఆమె ఇంట్లోకి వెళ్లారు.ఆమెను బెదిరించి సామూహిక అత్యాచారం చేశారు. దీన్ని వారిలో ఒకరు ఫోన్లో రికార్డు కూడా చేసి, ఎవరితోనూ చెప్పొద్దని భయపెట్టారు. దీంతో ఆమె తనపై జరిగిన లైంగిక దాడిని ఎవరికీ చెప్పలేదు. ఆ తర్వాత నిందితుల్లో ఒకడు మళ్లీ ఆ వీడియోలు చూపించి తనకు అనుకూలించకపోతే ఆ సోషల్ మీడియాలో పెడతానని బెదిరించి మరోసారి అత్యాచారం చేశాడు. ఇలా నిందితులు తరచూ ఆ వీడియోను అడ్డు పెట్టుకొని ఆమెపై అత్యాచారం చేస్తూ వస్తున్నారు. ఇటీవల బాధితురాలు ఈ విషయాన్ని తన తల్లిదండ్రులకు చెప్పడంతో అసలు సంగతి బయట పడింది. వెంటనే వారు గత ఆదివారం హయత్ నగర్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఐదుగురు నిందితులపైనా పోక్సో చట్టంతోపాటు అసభ్యకర వీడియోను చిత్రీకరించి, షేర్ చేసినందుకు ఐటీ చట్టం కింద కూడా కేసులు పెట్టారు. సెక్షన్ 67ఏ, 67బీ కింద కూడా కేసులు నమోదు చేశారు. బాధితురాలికి మెడికల్ టెస్టుల కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు నేరానికి సంబంధించి సాంకేతిక ఆధారాలు సేకరించి, 24 గంటల్లోనే ఐదుగురు మైనర్లను అరెస్టు చేశారు. వారి దగ్గర మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని జువైనల్ జస్టిస్ బోర్డు ముందు హాజరుపరిచారు. ఆ తర్వాత వారిని జువెనైల్ హోంకు తరలించారు. ఈ కేసుకు సంబంధించి మైనర్ల అత్యాచార వీడియోను జనాలు ఎవరూ మరొకరికి ఫార్వర్డ్ చేయొద్దని రాచకొండ పోలీసులు చెప్పారు. ఎవరైనా ఈ వీడియోలు చూస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. ఒకవేళ తమ ఆదేశాలను బేఖాతరు చేసి ఫార్వర్డ్లు చేస్తే పోక్సో చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# టీచర్ ఎమ్మెల్సీపై బీజేపీ ఆశలు

**ప్రజాతపన , హైదరాబాద్:**

మహబూబ్నగర్– రంగారెడ్డి – హైదరాబాద్ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉన్న ఓటర్లు 29 వేల 7 వందల 20. బరిలో ఉన్న అభ్యర్థులు 21 మంది. సిట్టింగ్ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్రెడ్డి మరోసారి బరిలో దిగగా.. పీఆర్టీయూ నుంచి ఆ సంఘం నేత చెన్నకేశవరెడ్డి పోటీ చేస్తున్నారు. అధికారపార్టీ మద్దతు తనకే అని చెన్నకేశవరెడ్డి ప్రచారం చేసుకుంటున్నారు. ఇక ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన హర్షవర్ధన్రెడ్డి సైతం అదృష్టాన్ని పరీక్షించు కుంటున్నారు. ఆయనకు కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించింది. ఇక ఈ ఎన్నికల్లో తొలిసారి అధికారిక అభ్యర్థిని ఫీల్డ్లోకి దించింది బీజేపీ. ఏవీఎన్ రెడ్డితో నామినేషన్ వేయించి.. ప్రచార బాధ్యతలను భుజాన వేసుకున్నారు కమలనాథులు. ఇందులో ప్రత్యేకత లేకపోయినా.. బీజేపీ నేతలు టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం తీసుకుంటున్న శ్రద్ధే చర్చగా మారుతోంది.తెలంగాణలో అధికారంలోకి రావాలన్నది కమలనాథుల ఆశ. అందుకే ఎన్నిక ఏదైనా వదులుకోవడానికి సిద్ధంగా లేరు బీజేపీ నేతలు. ప్రస్తుతం శాసనమండలిలో బీజేపీకి ప్రాతినిధ్యం లేదు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా ఉన్న రామచంద్రరావు మొన్నటి ఎన్నికల్లో ఓడిపోవడంతో.. మండలిలో బీజేపీకి చోటు లేకుండా పోయింది. ఇప్పుడు ఆ లోటును భర్తీ చేసుకునే పట్టుదలతో కనిపిస్తోంది కమలం పార్టీ. అందుకే ఈ మూడు జిల్లాల బీజేపీ నేతలతోపాటు.. రాష్ట్ర నాయకులు ప్రచారంపై ప్రత్యేక ఫోకస్ పెడుతున్నారు. ఢిల్లీ నుంచి బీజేపీ అగ్ర నేతలు వచ్చి సమీక్షలు చేస్తున్నారు. మొత్తం 29వేల మంది టీచర్ ఓటర్లలో 25 మందికో ఇంఛార్జ్ను ఏర్పాటు చేసింది బీజేపీ. ఈ పని మొత్తాన్ని సీనియర్ నేత ఇంద్ర సేనారెడ్డి కోఆర్డినేట్ చేస్తున్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, తెలంగాణ బీజేపీ సహ ఇంఛార్జ్ అరవింద మీనన్ తదితరులు సమీక్షలు పెడుతున్నారు. అన్నీ కార్యక్రమాలను పక్కన పెట్టి.. ఎక్కువసార్లు ఓటర్లను కలవాలన్నది బీజేపీ వ్యూహంగా కనిపిస్తోంది. వివిధ టీచర్ యూనియన్ల నుంచి అభ్యర్థులు పోటీలో ఉండటంతో.. ఓట్లు చీలుతాయనే లెక్కలు వేస్తున్నారు పార్టీ నేతలు. మొదటి ప్రాధాన్యత కాకపోయినా రెండో ప్రాధాన్యత ఓటు ఏవీఎన్ రెడ్డికి పడుతుందని ఆశిస్తున్నారు. వీటిని పక్కాగా సమన్వయం చేసుకుంటే ఆశించిన ఫలితం రావొచ్చన్నది వారి అభిప్రాయం.

# శ్రీ చైతన్యలో టీచర్లే బానిసలు..

**ప్రజాతపన , హనుమకొండ**

ప్రభుత్వ సెలవు దినాల్లో పాఠశాలలు నడుపవద్దని విద్యా శాఖ అధికారుల నుండి స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ ఉమ్మడి వరంగల్ జిల్లాలో(హనుమకొండ, భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్, ములుగు) ఆదివారం కూడా సెలవు ఇవ్వకుండా, ప్రైవేట్ టీచర్ లను విధులకు హాజరు కావాలని, ఎలాంటి లీవ్ లు ఇవ్వ కూడదని, టీచర్లను బానిసలను చేస్తుంది శ్రీచైతన్య యాజమాన్యం అని తెలంగాణ ప్రైవేట్ టీచర్ ఫోరమ్(టిపిటిఎఫ్)ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు చంద్రగిరి సునిల్ కుమార్ డిమాండ్ చేసారు.ప్రైవేట్ స్కూల్ టీచర్లకు శాపం..తేదీ 11, 12 మార్జి 2023 అంటే రేపు ఎల్లుండి రెండు రోజులు ఖచ్చితంగా టీచర్లు అందరూ పాఠశాల రావాలని, సెలవులు ఇవ్వడం కుదరదని శ్రీ చైతన్య పాఠశాలలకు చెందిన వరంగల్, ఖమ్మం జోన్ ల ఇంఛార్జ్ రాంకీ హుకుం జారీ చేసారు. శనివారం వరకు సరే గానీ ప్రభుత్వ నిభందనలు తుంగలో తొక్కి ఆదివారం కూడా తప్పకుండా స్కూల్ కి రావాలని అనడం ఏంటి? అని తెలంగాణ ప్రైవేట్ టీచర్ ఫోరమ్ ప్రశ్నిస్తుంది. ఇందులో ఇంకో విషయం ఏమిటంటే ఈ శనివారం, ఆదివారం మిగతా స్కూల్లో ఇంటర్వ్యూలు జరుగుతున్న నేపథ్యంలో ఆ ఇంటర్వ్యూలకు హాజరు కాకుండా టీచర్లను కట్టడి చేయడానికి శ్రీ చైతన్య యాజమాన్యం పన్నిన పన్నాగంలా అనిపిస్తుంది అన్నారు. ఈ పన్నాగంలో బలి పశువులు టీచర్లు. ఆదివారం కూడా అడ్మిషన్ల పేరిట తిప్పుతున్న శ్రీ చైతన్య నుండి తెలంగాణలో ప్రతీ ప్రైవేట్ టీచర్ శ్రమ దోపిడీ నుండి వాళ్ల అరాచకాల నుండి విముక్తి కావాలి అని వాపోయారు. ఇప్పటికైనా శ్రీచైతన్య విధానాలు మార్చుకొకపోతే టిపిటిఎఫ్ తరపున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఇలాంటి విద్యా సంస్థల యొక్క గుర్తింపును రద్దు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, జిల్లా విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్ ఫోరమ్(టి పి టి ఎఫ్)ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు చంద్రగిరి సునిల్ కుమార్ డిమాండ్ చేసారు.

## బీఆర్ఎస్, మజ్లిస్ జెండాలను చూస్తేనే మహిళలు వణికిపోతున్నారు

**పజాతపన , హైదరాబాద్**

శుక్రవారం హైదరాబాద్ లో జరిగిన "మహిళా గోస బీజేపీ దీక్ష"బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పాల్గొన్నారు. తరువాత అయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు.

బండి సంజయ్ మాట్లాడుతూ తెలంగాణలో బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీ జెండాలను చూస్తేనే తెలంగాణ మహిళలు భయపడే పరిస్థితి నెలకొంది. మహిళలపై హత్యలు, అత్యాచారాలు చేసే నేరస్తులను కాపాడే పార్టీలు ఆ రెండు. సినిమాల్లో విలన్లను చూస్తే ఎట్లా పారిపోతారో... ఆ రెండు జెండాలను చూస్తే ఆడవాళ్లు భయపడి ఇంట్లో తలుపులు వేసుకునే దుస్థితి ఏర్పడింది"అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. తెలంగాణలో మహిళా సమస్యలపైనా, మహిళలకు జరుగుతున్న అన్యాయంపైనా, మహిళా బిల్లుపైన ఏనాడూ నోరు మెదపని కేసీఆర్ బిడ్డ ఢిల్లీలో దీక్ష చేయడం సిగ్గు చేటని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీలో, కేసీఆర్ కేబినెట్ లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా దారుణంగా అవమానిస్తున్న కేసీఆర్ బిడ్డకు ఢిల్లీలో దీక్ష చేసే నైతిక అర్హతే లేదన్నారు. పార్టీ సంస్థాగత పదవుల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనన్నారు. మహిళా బిల్లు విషయంలో బీజేపీ చిత్తశుద్ధిని శంకించడం సిగ్గు చేటన్నారు. 1999 నుండి 2003 వరకు అనేకసార్లు పార్లమెంట్ లో వాజ్ పేయి ప్రభుత్వం మహిళా బిల్లును ప్రవేశపెడితే ఆమోదించకుండా వ్యతిరేకించడమే కాకుండా బిల్లు ప్రతులను సభలోనే చించివేసిన ఎస్పీ, ఆర్జేడీ, ఎంఐఎం పార్టీలతో కలిసి బీఆర్ఎస్ అంటకాగుతూ దీక్ష చేయడం విడ్డూరమన్నారు. లిక్కర్ దందాపై ప్రజల్లో జరుగుతున్న చర్చ నుండి దారి మళ్లించేందుకే మహిళా దీక్ష పేరిట డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఏ లిక్కర్ దందాతోనైనా మహిళల జీవితాలను నాశనం చేస్తున్నారో... వాళ్లే మహిళా బిల్లు పేరుత దీక్ష చేయడం వింతలో కెల్ల పెద్ద వింత అని ఎద్దేవా చేశారు. ఈ మహిళా మోర్చా ఆధ్వర్యంలో "మహిళా గోస ? బీజేపీ భరోసా'కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ సహా పలువురు మహిళా నేతలు దీక్ష చేశారు.


## వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి

**ప్రజాతపన , కౌతాలము**

వైఎస్ఆర్సిపి పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి ఓటు వేసి వేయించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బాపురం వైసీపీ యువ నాయకులు గురునాథ్ రెడ్డి బాపురం వీర్లదిన్నె ,దొమ్మలదిన్నె, గ్రామాలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో మాట్లాడుతూ విద్యరంగ అభివృద్ధికి సీఎం జగన్మోహన్ రెడ్డి అమ్మబడి,విద్యాదీవెన,వసతి,దీవెన వంటి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని రైతులు కూడా తమ పిల్లలు చదువులకు ముఖ్యమంత్రి చేస్తున్న కృషికి పిల్లల బాధ్యత తీసుకున్నారని సంతోషంగా తల్లితండ్రులు వారి పొలాల్లో పనులు చేసుకుంటున్నారని,కావున పట్టభద్రులు, ఉపాధ్యాయులు సీఎం చేస్తున్న మంచి కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్సీ అభ్యర్థిగా కేటాయించిన వెన్నపూస రవీంద్రరెడ్డికి తమ ఓటును వేసి వేయించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గురునాథ్ రెడ్డి, కొరారు. ఈ ప్రచారంలో జయపాల్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## భ్రమరాంబ అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ

**ప్రజాతపన , శ్రీశైలం**



చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళ లేదా శుక్రవారం రోజున (ఏ రోజు ముందుగా వస్తే ఆ రోజు) శ్రీ భ్రమరాంబాదేవి అమ్మవారికి కుంభోత్సవం జరపడం సంప్రదాయం. ఈ సంవత్సరం. ఏప్రిల్ 11న ఈ కుంభోత్సవం నిర్వహించబడుతుంది. అమ్మవారికి సాత్వికబలి నిర్వహించేందుకు కొబ్బరికాయలు, గుమ్మడికాయలు, నిమ్మకాయలు, (మొదలగునవి సమర్పించడం) ఈ కుంభోత్సవం జరిపించడం ఆనవాయితి కుంభోత్సవం రోజున స్త్రీ. వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతి సమర్పించడం ప్రధాన ఘట్టం.కాగా ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే ప్రతి మంగళవారం మరియు శుక్రవారం రోజులలో అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పించడం. జరుగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం అనగా ఈ రోజున అమ్మవారికి –కొబ్బరికాయలు సమర్పించబడ్డాయి.ఈ కార్యక్రమంలో ముందుగా అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు కుంకుమలతో వాటికి పూజాదికాలు జరిపించడం జరిగింది. తరువాత అమ్మవారికి ఈ కొబ్బరికాయలు సమర్పించారు.

## లైంగికంగా ఎమ్మెల్యే వేధిస్తున్నాడు

**వరంగల్**

జనగామ జిల్లాలోని స్టేషన్ ఘన్పూర్కు చెందిన ఓ బీఆర్ఎస్ నేత తనను వేధిస్తున్నాడని అదే పార్టీకి చెందిన సర్పంచ్ మీడియా ముందుకు వచ్చారు. కన్నీరు పెట్టుకున్నారు. మాట వినలేదని గ్రామాభివృద్ధికి కేటాయించిన నిధులు ఆపేశారని వాపోయారామె. బి.ఆర్.ఎస్ నేత ఒకరు తనను లైంగికంగా మానసికంగా వేధిస్తున్నారని ధర్మసాగర్ మండలం జానకిపురం సర్పంచ్ కూర్సపల్లి నవ్య ఆరోపించారు. మీడియాతో ఆమె మాట్లాడుతూ కన్నీరు పెట్టుకున్నారు. ఆ నేత కోరిక తీర్చాలంటూ మండలంలోని ఓ మహిళ నేతపై కూడా కొందరు ఒత్తిడి తీసుకొచ్చారని ఆమె ఆరోపించారు. ఇప్పుడు తన వంతు వచ్చిందన్నారు. సదరు నేత అనుచరులు చెప్పిన మాట తాను వినలేదని గ్రామ అభివృద్ధి నిధులు కేటాయింపులో వివక్ష చూపిస్తున్నారని నవ్య వాపోయారు. పార్టీ కార్యక్రమాలకు పిలవడం లేదని ఆవేదన చెందారు. వారికి అక్క చెల్లెలు లేరా?అంటూ ప్రశ్నించారు నవ్య.ఆస్తులు బంగారం అమ్ముకుని ప్రజలకు సేవ చేస్తున్నామని, నేతల కోరికలు తీర్చేందుకు రాజకీయాల్లోకి రాలేదని ఫైర్ అయ్యారు నవ్య. ధర్మసాగర్ వేలేరు మండలాల్లో అగ్రవర్ణాల నాయకులదే పెత్తనమని రెండు మూడు వర్గాలు ఉండటంతో అభివృద్ధి కుంటుపడుతుందోని విమర్శించారు. గత నెలలో మంత్రి కేటీఆర్ పర్యటించినప్పుడు ఓ మహిళా ప్రజాప్రతినిధి తనను తీవ్రంగా అవమానించారంటు ఏడ్చేశారు.

## వధువు మృతి.. బంధువుల అందోళన

**గుంటూరు**

గుంటూరు జిల్లాలోని పెదకాకాని మండలం గడ్డిపాడులో దారుణ ఘటన చోటుచేసుకుంది. నవ వధువు నవ్య అనుమానాస్పదంగా మృతి చెందింది. భర్త మహేష్.. నవ్యపై దాడిచేసి చంపేశాడని కుటుంబ సభ్యుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు నెలల క్రితం నవ్యకు మహేష్తో వివాహం జరిగింది. కాళ్ల పారాణి ఆరకముందే తమ బిడ్డను హత్య చేశారని మృతురాలి తల్లిదండ్రుల ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను అరెస్ట్ చేయాలని జీజీహెచ్ వద్ద మృతురాలి కుటుంబీకులు, బంధువులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు. భర్తే హత్య చేశాడా? లేక కుటుంబ కహాల నేపథ్యంలో ప్రాణం తీసుకుందా?, పెళ్లై నాలుగు నెలలు గడవముందే ఈ ఘోరమైన ఘటన ఎలా జరిగివుండొచ్చు? ఏమైనా అక్రమ సంబంధాల వ్యవహారం ఉందా? అలాగే అత్తింటి వేధింపులే కారణమా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

# బీసీలకు 50 శాతం రిజర్వేషన్ పెట్టేవరకు ఉద్యమం

**ప్రజాతపన నల్గొండ**

చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్ పేట్టే వరకు ఉద్యమం కొనసాగుతోందని రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య అన్నారు. శుక్రవారం నాడు అయన నల్గోండలో మీడియాతో మాట్లాడారు. 56 శాతం ఉన్న వారికి వరుస అన్యాయం జరుగుతోంది. ప్రజాస్వామ్యం దేశంలో ధన స్వామ్యం నడుస్తుంది. 14 శాతమే ఇప్పటివరకు బీసీలకు అవకాశాలు. అవకాశం రానప్పుడు ప్రజాస్వామ్యం ఎలా అవుతుంది.దేశ సంపదలో బీసీ ల భాగస్వామ్యం ఎక్కువ కానీ రాజ్యాంగ పరంగా న్యాయమైన వాటా రావడంలేదని అన్నారు. బీసీ ల అభివృద్ధి అడ్డుకుంటే.. బీసీ కుల సంఘాలు ఎం చేస్తున్నాయి. ఇప్పటి ప్రభుత్వాల అగ్రకుల ధోరణి ఉన్న ప్రభుత్వాలు. బీసీ ప్రధాని ఉన్నారు కాబట్టి బీసీలు గట్టిగా కొట్లాడాలి. జరుగుతున్న అన్యాయంపై బీసీలు ఆత్మపరిశీలన చేసుకోవాలి. బీసీ లకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ పెట్టాలి. బీసీ ల ప్రతి కుటుంబానికి 50 లక్షల సబ్సిడీ ఋణాలు ఇవ్వాలి. రాజకీయ అవసరాల కోసం బీసీ లను వాడుకుంటున్నారు. బీసీ లు బానిసత్వం వదలాలి. ఏప్రిల్ 3 చలో ఢిల్లీ , పార్లమెంట్ ముందు ధర్నా విజయవంతం చేయాలి. బీసీ బిల్లు పెట్టేవరకు పోరాటం ఆగదు. పార్టీలకు అతీతంగా బీసీలు తెగించి పోరాడాలి. వైకాపా మాత్రమే బీసీ బిల్లు కోసం పార్లమెంటులో కొట్లాడింది. జంతువులకు జన గణన ఉన్న.. దేశంలో బీసీ జనాభా గణన ఉండదా అని ప్రశ్నించారు.

## విశ్రాంత ఉద్యోగుల బకాయిలు విడుదల చేయించండి

**ఎమ్మెల్సీ గోవింద్ రెడ్డిని కోరిన విశ్రాంత ఉద్యోగులు**

**ప్రజాతపన ,బద్వేలు**



ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు రావలసిన బకాయిలను వెంటనే విడుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలని వైకాపా ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి నీ బద్వేలు ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు ఈ మేరకు బద్వేల్ లో శుక్రవారం ఎమ్మెల్సీ గోవింద్ రెడ్డి కలిసి వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంగం అధ్యక్షుడు డాక్టర్, మీనాక్షి రెడ్డి కార్యదర్శి కత్తి బ్రహ్మయ్య మాట్లాడుతూ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు ప్రతినెల ఒకటవ తేదీ పెన్షన్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు అలాగే విశ్రాంతి ఉద్యోగులకు బకాయి పడ్డ రెండు డి ఏ లను విడుదల చేయి చాలా చూడాలన్నారు కార్యక్రమంలో ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కోశాధికారి గంగన్న అసోసియేట్ అధ్యక్షుడు గంజికుంట పుల్లయ్య గౌరవ సలహాదారుడు పుల్లంరాజు ఆర్గనైజింగ్ కార్యదర్శి పిచ్చయ్య ఉపాధ్యక్షుడు ఆనందరావు తదితరులు పాల్గొన్నారు

# విఓయే ల సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాతపన , హైదరాబాద్**

ప్రభుత్వం వెంటనే విఓయే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే జగ్గారెడ్డి శుక్రవారం నాడు సీఎం కేసీఆర్ కు లేఖ రాసారు. సెర్ప్ సంస్థలో పని చేస్తున్న ఉద్యోగుల డిమాండ్స్ ని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి. తెలంగాణ ఉద్యమంలో విఓయే లు కూడ కీలక పాత్ర పోషించారు. విఓయే లు గ్రామస్థాయి లో గత 20ఏళ్లుగా డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా, సామజికంగా ఎదగడానికి లు పని చేస్తున్నారు. మొత్తం రాష్ట్రం లో 20 వేల వరకు విఓయే ఉద్యోగులు పని చేస్తున్నారు. అందరు మహిళలే, గ్రామస్థాయిలో పని చేస్తుంటారు. ఐతే విఓయే లకు ఇప్పటికి కేవలం 3900 రూపాయలు మాత్రమే వేతనం ఇస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత విఓయే ల డిమాండ్స్ నెరవేరుస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ 8 ఏళ్లు అవుతున్న విఓయే ల సమస్య లు పరిష్కారం కాలేదు. పెరుగుతున్న నిత్యావసర ధరలతో చాలీలిచాలని జీతాలతో ఐకేపీ విఓయే లు చాలా ఇబ్బంది పడుతు న్నారు. ప్రభుత్వం వెంటనే విఓయే లకు సెర్ప్ నుండి 15 వేల రూపాయల వేతనం చెల్లించాలి. విఓయే ఉద్యోగులను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి. 10 లక్షలతో భీమా కల్పించాలి, ఆరోగ్య భీమా సౌకర్యం కల్పించాలి. సెర్ప్ నుండి ఐడీ కార్డు లు ఇవ్వాలి. విఓయే లందరికి ఒకేరకమైన యూనిఫామ్ ఇవ్వాలి. ఈ అంశాన్ని అసెంబ్లీ సమావేశాల్లో కూడ ప్రస్థావించడం జరిగింది. ఇప్పుడు మరొకసారి ప్రభుత్వానికి గుర్తు చేయడానికి సిఎం గారికి లేఖ రాస్తున్న. ఇటీవలే నా దగ్గరికి వస్తున్న సమస్యలను లేఖ ద్వారా, మీడియా ద్వారా మీ దృష్టికి కి తీసుకొని వస్తున్న. వెంటనే ప్రభుత్వం విఓయే ల డిమాండ్స్ నెరవేర్చాలని కోరుతున్నానని అయన లేఖలోపేర్కోన్నారు.

# పిడిఎఫ్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి

**ప్రజాతపన , ఎమ్మిగనూరు**

పట్టణంలో శుక్రవారం సిఐటియు నాయకులు రాముడు, అంబేద్కర్ ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు అజిత్ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థుల తరఫున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు పట్టభద్రులతో మరియు టీచర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని మరియు నిరుద్యోగులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న గ్రూప్స్ మరియు డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మార్చి 13న జరుగుతున్న పట్టభద్రుల టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలలో పిడిఎఫ్ బలపరుస్తున్న పట్టభద్ర ఎమ్మెల్సీ అభ్యర్థి పోతల నాగరాజు గారిని మరియు టీచర్స్ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి గారికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని తెలియజేశారు. అలాగే ఎమ్మి గనూరులో ప్రైవేట్ స్కూల్స్ కాలేజీలలో పనిచేస్తున్న అనేకమంది పట్టభద్రులకు టీచర్లకు ఓటర్ స్లిప్పులు ఇంతవరకు ఇవ్వలేదని కాబట్టి తక్షణమే సచివాలయం సిబ్బంది వారు పట్టభద్రులకు ఓటర్ స్లిప్పులు మంజూరు చేయాలని తెలియజేశారు.. సెమీఫైనల్గా భావిస్తున్న టువంటి ఈ యొక్క ఎమ్మెల్సీ ఎన్నికలలో వామపక్షాలు బలపరుస్తున్న ఈ యొక్క అభ్యర్థులను గెలిపించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు రవి పాల్గొన్నారు..

## చెట్టుకు ఉరి వేసుకొని యువతి మృతి

**ప్రజాతపన ,రంగారెడ్డి**

రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల కొంగల కలాన్ లో ఒక యువతి అనుమానస్పద స్థితిలో చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందింది. ఆత్మహత్య కాదు హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని మృతురాలి బంధువులు ఆందోళనకు దిగారు. కొంగర కలాన్ లోఓ ప్రవేట్ వెంచర్ లో చెట్టుకు ఉరిసుకొని అనుమానాస్పద స్థితిలో అదే గ్రామానికి చెందిన అంబోత్ పల్లవి (21)మృతి చెందింది. ఇది ఆత్మహత్య కాదు హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని మృతురాలి బంధువులు సంఘటన స్థలంలోనే ఆందోళనకు దిగారు. ఆదిభట్ల పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం వండర్ లా లో పనిచేసే పల్లవి ప్రతిరోజు సాయంత్రం ఆరు గంటలకు ఇంటికి చేరుకునేదని నిన్న రాత్రి యెనిమిది గంటలైనా ఇంటికి రాకపోవడంతో ఆదిభట్ల పోలీసులకు ఫిర్యాదు చేసినా రాత్రి పోలీసులు వేతకకపోవడం వల్లనే తమ బిడ్డ మృతిచెందిందని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కొంగరకలన్ అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా చేశారు.

# అవినాష్ ను విచారిస్తున్న సీబీఐ



**ప్రజాతపన , హైదరాబాద్**

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన వివేకానంద రెడ్డి హత్య కేసులో సీబీఐ విచారణకు వైసీపీ ఎంపీ అవినాష్ రెడ్డి మరోసారి హాజరయ్యారు. ఈ ఉదయం జూబ్లీహిల్‌లోని తన నివాసం నుంచి అనుచరులతో బయల్దేరి కోఠిలోని సీబీఐ కార్యాలయానికి వచ్చారు. వివేక హత్య కేసులో ఎంపీ అవినాష్‌ను సీబీఐ విచారించడం ఇది మూడోసారి. ఇప్పటికే జనవరి 28న, ఫిబ్రవరి 24న రెండుసార్లు అవినాష్ రెడ్డిని విచారించారు. వైఎస్ వివేకానందరెడ్డి గుండెపోటుతో చనిపోయాడని తాను ఎవరికీ చెప్పలేదని వైఎస్ అవినాష్ రెడ్డి స్పష్టం చేశారు. అప్పట్లో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వమే గుండెపోటు అంశాన్ని సృష్టించిందని అవినాష్ రెడ్డి ఆరోపించారు. సీబీఐ విచారణకు మూడో సారి హాజైన ఆయన విచారణ తర్వాత మీడియాతో మాట్లాడారు. ఈ కేసుకు సంబంధించి చాలా విషయాలను మీడియాతో మాట్లాడారు. వైఎస్ వివేకానందరెడ్డి రెండో పెళ్లి చేసుకున్నారని.. ఇలా చాలా ముఖ్యమైన అంశమన్నారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య సమయంలో ఓ లేక దొరికిందని.. ఆ లేఖను వివేకా అల్లుడు రాజశేఖర్రెడ్డి దాచి పెట్టారన్నారు. ఆ లేఖ విషయంపై దర్యాప్తు చేయడం లేదన్నారు. సీబీఐ విచారణ దారి తప్పుతోందని ఆరోపించారు. కంచే చేను మేసినట్లుగాసీబీఐ వ్యవహరిస్తోందని... కుటుంబంలో గొడవలను పట్టించుకోవడం లేదన్నారు.

**వివేకా హత్య ఆస్తుల కోసమే జరిగిందని తేల్చిన అవినాష్ రెడ్డి**

ఆస్తుల పంపకంలో వైఎస్ వివేకాకు.., కుమార్తె, అల్లుడికి మధ్య గొడవలు ఉన్నాయన్నారు. ఆస్తుల కోసమే హత్య జరిగిందని అవినాష్ రెడ్డి స్పష్టం చేశారు. సీబీఐ అధికారులు మరోసారి విచారణకు పిలుస్తామని చెప్పారని మీడియాకు తెలిపారు. కట్టుకథను అడ్డు పెట్టుకుని విచారణ చేస్తున్నారని.. సీబీఐ చేస్తున్న ఆరోపణలన్నీ నిరాధారమన్నారు. సీబీఐ అధికారులు చెబుతున్న గూగుల్ టేకవుట్ ను టీడీపీ టేకవుట్‌గా అవినాష్ రెడ్డి అభివర్ణించారు. విచారణ విషయంలో సీబీఐ కూడా లీకులు ఇస్తోందని ఆరోపించారు. ఎనిమిది మంది సాక్షులు ఇచ్చిన సాక్ష్యాలను సీబీఐ పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

**నాపై ఆరోపణల వెనుక భారీ కుట్ర : అవినాష్ రెడ్డి**

బెంగళూరు సెటిల్మెంట్ విషయంలో వచ్చిన సొమ్ము విషయంలో ఈ హత్య జరిగిందన్నదని నిజం కాదని.. ఆస్తుల కోసమే హత్య జరిగిందని అవినాష్ రెడ్డి మీడియా ముందు స్పష్టం చేశారు. తాను ఏ తప్పు చేయలేదని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు హామీ ఇస్తున్నానని వైఎస్ అవినాష్ రెడ్డి స్పష్టం చేశారు. తనను లక్ష్యంగా చేసుకునే విచారణ చేస్తున్నారని.. దీని వెనుక పెద్ద కుట్ర ఉందని చెప్పుకొచ్చారు. మూడో సారి సీబీఐ విచారణకు పిలవడంతో అరెస్ట్ చేస్తారన్న ప్రచారం జరిగింది. దీంతో పులి వెందుల నుంచి పెద్ద ఎత్తున అవినాష్ రెడ్డి అనుచరులు హైదరాబాద్‌లోని సీబీఐ కార్యాలయం దగ్గర గుమికూడారు. అవినాష్ రెడ్డి సీబీఐ విచారణకు దగ్గరకు వచ్చినప్పుడుపెద్ద ఎత్తున నినాదాలు చేశారు. విచారణలో భాగంగా ఈనెల ఆరో తేదీన హైదరాబాద్ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని ఈనెల 4వ తేదీన పులివెందులలోని వైయస్ అవినాష్ రెడ్డి ఇంటికి వెళ్లి నోటీసులు ఇచ్చారు. తనకు ముందుగా నిర్ణయించిన కార్యక్రమాలు కారణంగా ఆ తేదీన రాలేనని చెప్పారు. సిబిఐకి అవినాష్ రెడ్డి లేఖ రాశారు. దీంతో సిబిఐ అధికారులు ఈనెల 10వ తేదీన విచారణకు హాజరుకావాలని అవినాష్ రెడ్డి ఇంటికి వెళ్లి నోటీసులు జారీ చేశారు. దీంతో ఆయన మూడోసారి సిబిఐ విచారణకు హాజరయ్యారు. ఈనెల 12వ తేదీన వైఎస్ అవినాష్ రెడ్డి తండ్రి భాస్కర్ రెడ్డిని కూడా విచారణకు హాజరు కావాలని ఇప్పటికే సిబిఐ అధికారులు నోటీసులు జారీ చేశారు. వై.ఎస్. వివేకా హత్య కేసులో నిందితుడు సునీల్ యాదవ్ బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో సీబీఐ దాఖలు చేసిన కౌంటర్‌లో అవినాష్ రెడ్డిపై ప్రధానంగా అనుమానాలు వ్యక్తం చేసింది. వైఎస్ అవినాష్‌రెడ్డి, శివశంకర్ రెడ్డితో వివేకాకు రాజకీయ వైరుధ్యం పెరిగిందని సీబీఐ పేర్కొంది. ఎంపీ టికెట్ అవినాష్‌రెడ్డికి బదులు తనకు ఇవ్వాలని వివేకా కోరుకున్నారని తెలిపింది. తనకు ఇవ్వకపోయినా షర్మిల, విజయమ్మకు ఇవ్వాలని వివేకా పట్టుబట్టారని పేర్కొంది. వివేకా రాజకీయ కదిలికలు అవినాష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డికి నచ్చలేదని సీబీఐలో తెలిపింది. శివశంకర్‌రెడ్డితో కలిసి అవినాష్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి వివేకా హత్యకు కుట్ర పన్నినట్లు తెలుస్తోందని పేర్కొంది. హత్య జరిగిన రోజు రాత్రి వై.ఎస్. అవినాష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి ఇంటికి సునీల్ యాదవ్ వెళ్లాడని ఐదుగురితో కలిసి అవినాష్‌రెడ్డి హత్య స్థలానికి వెళ్లాడని తెలిపింది. నిందితులు హత్య జరిగిన స్థలాన్ని శుభ్రం చేశారని వివేకా శరీరంపై ఉన్న గాయాలు కనిపించకుండా బ్యాండేజీ కట్టారని కోర్టుకు సమర్పించిన కౌంటర్‌లో సీబీఐ పేర్కొంది. ఈ కోణంలోనే సీబీఐ విచారణ సాగుతున్నట్టు తెలుస్తోంది. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తనను అరెస్ట్ చేయకుండా సీబీఐకి ఆదేశాలివ్వాలని కోరుతూ అవినాష్ రెడ్డి వేసిన రిట్ పిటిషన్ తెలంగాణ హైకోర్టు కాసేపట్లో విచారణకు రానుంది. సీబీఐ తనను విచారించే సమయంలో ఆడియో, వీడియో రికార్డింగ్ చేయాలని పిటిషన్‌లో కోరారు అవినాష్‌రెడ్డి. తన న్యాయవాది సమక్షంలోనే విచారణ చేయాలని ... పలుమార్లు కోరినా సిబిఐ తన అభ్యర్థనను అంగీకరించలేదన్నారు. 160 అఖీఖఅ నోటీస్ ఇచ్చారు కాబట్టి సీబీఐ ఎలాంటి బలవంతపు, చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు. వివేకా హత్య కేసులో ఏ4 నిందితుడిగా ఉన్న దస్తగిరిని.. ఇప్పటివరకు సీబీఐ అరెస్ట్ చేయలేదని.. దస్తగిరి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కూడా సీబీఐ ఎక్కడా వ్యతిరేకించలేదని అవినాష్ రెడ్డి పిటిషన్‌లో పేర్కొన్నారు. దస్తగిరి అక్కడ ఇక్కడ విని చెప్పిన మాటల ఆధారంగానే..సీబీఐ విచారణ కొనసాగుతోందన్నారు. తనకు వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాధారాలు లేకపోయినప్పటికీ..ఈ కేసులో నన్ను ఇరికించే ప్రయత్నం జరుగుతోందని అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. సునీల్ యాదవ్ గూగుల్ టేక్ఔట్ ఫోన్ సిగ్నల్ లొకేషన్ చూపి సిబిఐ తనను వేధిస్తోందని.. స్పాట్ లో దొరికిన లేఖపై సిబిఐ దర్యాప్తు చేయటం లేదన్నారు. వివేకా హత్య కేసులో దర్యాప్తు అధికారి పనితీరు పక్షపాతంగా ఉందని.. వివేకా హత్య ఎలా జరిగిందో ముందుగానే నిర్ణయించుకొని..అదే కోణంలో విచారణ చేస్తున్నారని పిటిషన్ లో పేర్కొన్నారు. తప్పుడు సాక్ష్యాలు చెప్పేలా విచారణాధికారి కొందరిపై ఒత్తిడి తెస్తున్నారని.. తాను విచారణలో చెప్పిన విషయాలను కూడా విచారణ అధికారి మార్చేస్తున్నారని అవినాష్‌రెడ్డి ఆరోపించారు. నోటీస్ దశలో విచారణ సాగుతుండగా చార్జ్ షీట్‌లో నేరస్తునిగా సిబిఐ చిత్రీకరిస్తోందన్నారు.

# న్యూయార్క్ టైమ్స్ పై అనురాగ్ ఫైర్

**ప్రజాతపన , న్యూఢిల్లీ:**

కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ విదేశీ మీడియాపై మండి పడ్డారు. న్యూయార్క్ టైమ్స్ సహా పలు సంస్థలు భారత్‌పై, ప్రధాని నరేంద్ర మోదీపై బురదజల్లుతున్నాయంటూ తీవ్రంగా విమర్శించారు. కావాలనే దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. భారత దేశ ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకు కుట్రు చేస్తున్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కశ్మీర్‌లో పత్రికా స్వేచ్ఛపై న్యూయార్క్ టైమ్స్ రాసిన కథనాన్ని ఖండించారు. భారత్‌కు సంబంధించి ఏ వార్తనైనా సరే ఈ మీడియా సంస్థ ఎలాంటి ఆలోచన లేకుండా ప్రచురిస్తోందన్న అనురాగ్ ఠాకూర్..దేశ ప్రజాస్వామ్య విలువలపై దాడిగా అభివర్ణించారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రధాని నరేంద్ర మోదీపై దుష్ప్రచారాలు ఏంటని ప్రశ్నించారు. "కొన్ని విదేశీ మీడియా సంస్థలు భారత్‌పై అక్కసు వెళ్లగక్కుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీపైనా అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాయి. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంపై దాడి చేస్తున్నాయి. భారత్‌లో పౌరుల ప్రాథమిక హక్కులకు ఎలాంటి ప్రాధాన్యత ఉందో పత్రికా స్వేచ్ఛకూ అంతే ప్రాధాన్యత ఉంది. ప్రజాస్వామ్యయుతంగా నడుచుకునే మా దేశానికి మీరు డెమొక్రసీ పాఠాలు చెప్పాల్సిన పని లేదు. మీ అజెండా ఏటో అర్థమవుతోంది. కశ్మీర్ గురించి రాసిన ఆర్టికల్‌ను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇలాంటి మీడియాను భారత్ సహించదు"రాహుల్ గాంధీ బ్రిటన్ పర్యటనలో ఉన్నారు. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో స్పీచ్ కూడా ఇచ్చారు. ఈ క్రమంలోనే మరోసారి మోదీ సర్కార్‌పై విరుచుకు పడ్డారు. ప్రధాని మోదీ పాలనలో భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిపోయిందని విమర్శించారు. ప్రతిపక్ష నేతలందరిపైనా గుట్టుగా నిఘా పెడుతున్నారంటూ పెగాసస్ కేసుని ప్రస్తావించారు. దేశం అన్వయించుకోడానికి వీల్లేని విధానాలు బలవంతంగా రుద్దుతున్నారంటూ మండి పడ్డారు. పెగాసస్ గురించి చెబుతూ తన ఫోన్‌లోనూ పెగాసస్ వైరస్ ఉందని, ఇదే విషయం అధికారులు చెప్పారని అన్నారు. దీనిపై కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ స్పందించారు. రాహుల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. "నిన్నటి ఎన్నికల ఫలితాలు ఎలా వస్తాయో రాహుల్ గాంధీకి ముందే తెలుసు. కాంగ్రెస్‌ను బీజేపీ క్లీన్ స్వీప్ చేసింది. పెగాసస్ ఆయన ఫోన్‌లో కాదు. ఆయన మెదడులోనే ఉంది. బహుశా ఇటలీ ప్రధాని జార్జియా మెలోని ఏం చెప్పిందో రాహుల్ విన్నట్టు లేదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలందరూ ప్రధాని మోదీని గౌరవిస్తున్నారని చెప్పారు. తన మొబైల్‌లో పెగాసస్ ఉందన్న అనుమానం ఉన్నప్పుడు అది ప్రభుత్వానికి ఎందుకు ఇవ్వలేదు. విదేశాల్లోనే ఉన్న స్నేహితులతో చేతులు కలిపి దేశ పరువుని దిగజార్చేలా మాట్లాడుతున్నార అనురాగ్ ఠాకూర్ అన్నారు.

# ప్రగతి భవన్ ముందు దీక్ష చేయి

**ప్రజాతపన , హైదరాబాద్**

ధరణి పోర్టల్ ను తొలగిస్తేనే సామాజిక తెలంగాణ ఏర్పడుతుందని సంచలన వ్యాఖ్యాలు చేశారు సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క. ఉత్పత్తి రంగం కొద్ది మంది చేతుల్లో ఉంటే.. మిగతా ప్రజలు వారిపై ఆధారపడాల్సి ఉంటుందని అన్నారు. గతంలో భూమి ఒక్కటే ఉత్పత్తి రంగంగా ఉన్నప్పుడు.. కాంగ్రెస్ పేదప్రజలకు భూమిని పంచిన చరిత్ర కాంగ్రెస్ ది అని భట్టి పేర్కొన్నారు. తెలంగాణలో ఏ పోరాటం చూసినా? భూమికోసం జరిగినవే అని గుర్తు చేశారు. స్వతంత్ర భారత దేశంలో పోరాటాల లక్ష్యాలకు భిన్నంగా రాష్ట్రంలో చట్టాలు తీసుకొచ్చిందని పేర్కొన్నారు. పేదలకు పంచిన భూములను ధరణి చట్టంలోకి రాకుండా పక్కనబెట్టారని మండిపడ్డారు. వారికి పాస్ బుక్ లు, పట్టాలు ఇవ్వడంలేదన్నారు. ఖాస్తు కాలమ్ ను తొలగించి? భూమిని భూస్వాములకు అప్పగించిన పరిస్థితి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది చాలా ప్రమాదకరమైన పరిస్థితి అని పేర్కొన్నారు. పేద ప్రజలకు జరుగుతున్న అన్యాయంపై అసెంబ్లీలో కేసీఆర్ ను నిలదీశామన్నారు. ఫ్యూడల్ వ్యవస్థను, భూస్వామ్య విధానాన్ని బీఆరెస్ మళ్లీ తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోందన్నారు. ధరణి పోర్టల్ ను తొలగిస్తేనే సామాజిక తెలంగాణ ఏర్పడుతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే? ఖాస్తు కాలమ్ తో పాటు ఇతర కాలమ్స్ ను మళ్లీ చేరుస్తామని హామీ ఇచ్చారు.ఏఐసీసీ ఇంచార్జ్ మాణిక్ రావ్ ఠాక్రే మాట్లాడుతూ.. కేసీఆర్ సర్కారు ధరణి పేరుతో పేదల భూములను వారికి కాకుండా చేస్తోందని మండిపడ్డారు. మీ భూ హక్కులు మీకు తిరిగి కల్పించేందుకు కాంగ్రెస్ ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. పేదలకు కేసీఆర్ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసమే కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని ఠాక్రే తెలిపారు.కాంగ్రెస్ జాతీయ నాయకులు కొప్పుల రాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధరణి పోర్టల్ అదాలత్ వుంటుందని అన్నారు. ధరణి పోర్టల్ తో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పేదలకు భూ హక్కులు కల్పించిన పార్టీ కాంగ్రెస్ అని తెలిపారు. తెలంగాణలోని 12వేల గ్రామాల్లో ధరణి అదాలత్ లు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నిర్ణయించిందని అన్నారు. ధరణితో ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని వారికి హామీ ఇస్తుందని తెలిపాపరు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 100 రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామన్నారు.
















Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950